# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 29.11.2024 | 24 క్యారెట్లు 77,215.00 | కిలో వెండి 96,000.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:37

www.vishalabharati.com


# ప్రియాంకా అనే నేను..

## ఎంపీగా ప్రియాంకా గాంధీ ప్రమాణం

- రాజ్యాంగ ప్రతి చేతబూని ప్రమాణం
- ఎంపీ హోదాలో తొలిసారి లోక్‌సభలోకి
- అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో గందరగోళం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఇటీవల కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ఆమె.. గురువారం ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. సోదరుడు, ఎంపీ రాహుల్ గాంధీ, ఇతర నేతలు వెంట రాగా.. కేరళ సంప్రదాయాన్ని ప్రతిబింబించే 'కసావు' చీర ధరించి ప్రియాంక సభకు వచ్చారు. నేడు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా కొత్తగా ఎన్నికైన సభ్యులతో

..మిగతా 2 లో

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 14న పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ రిలీజ్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి రెండో వారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉండగా మూడు ఫేజుల్లో నిర్వహించనున్నారు. ఇప్పటికే పంచాయతీ రాజ్ శాఖ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. ఐదుగురు ఎంపీటీసీలతో ఒక ఎంపీపీ, ముగ్గురు ఎంపీటీసీలతో ఎంపీపీలున్న మండలాల్లో ఎంపీటీసీల సంఖ్యను 5 పెంచాలని రేవంత్ సర్కార్ నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకోసం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంపీపీ సవరణ బిల్లును ప్రవేశపెట్టడంతో పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసే బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

# పంచాయతీ పోరుకు ముహూర్తం ఫిక్స్




- సంక్రాంతి రోజే నోటిఫికేషన్
- మూడు దశల్లో ఎన్నికల నిర్వహణ
- షెడ్యూల్ ఖరారు చేసిన అధికారులు
- ఆ లోపే పూర్తి స్థాయి రైతు రుణమాఫీ
- ఇద్దరు పిల్లల నిబంధన రద్దు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో కుల గణన పూర్తి చేసిన తర్వాతే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే ప్రకటించారు. ఇందుకు అనుగుణంగానే కుల గణన కోసం ముందుగా కొత్త బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతమున్న కమిషన్ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగిసింది. దీంతో కొత్త కమిషన్ చైర్మన్, సభ్యులపై సీఎం రేవంత్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కాగా త్వరలో కొత్త కమిషన్‌ను ప్రకటిస్తామని ముఖ్యమంత్రి ఇటీవల చెప్పారు. మరోవైపు బీసీ కమిషన్ ఏర్పాటైన వెంటనే యుద్ధ ప్రాతిపదిక కుల గణన చేపడుతుంది. కుల గణనకు అవసరమైన విధివిధానాలు, నమూనాలు, పద్ధతులు, సర్వే ప్రశ్నలపై ప్రభుత్వం ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.

పంచాయతీ ఎన్నికల నిధుల కేటాయింపునకు సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర ఎన్నికల సంఘానికి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో వార్డుల వారీగా ఓటర్ల వివరాలు తెప్పించే పని మొదలుపెట్టిన ఎన్నికల సంఘం.. గురువారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల నిర్వాహణపై పలు సూచనలిచ్చారు. జనవరి మొదటి వారంలో కుల గణనకు సంబంధించిన ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని ప్రభుత్వాధికారి తెలిపారు. ఎన్నికలకు 15 రోజుల ముందుగా షెడ్యూల్ రిలీజ్ చేసి.. జనవరి నెల చివరి వరకు రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నట్లు వెల్లడించారు. రైతుల నుంచి వ్యతిరేకత రాకుండా ఎన్నికలకు ముందే పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.



## పదో తరగతి పరీక్షల్లో కీలక మార్పులు

- ఇంటర్నల్ మార్కులకు స్వస్తి
- ఇకపై 100 మార్కులకు పేపర్
- 2024-25లో నూతన విధానం
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

2 లో



## ఫుడ్ పాయిజన్‌పై టాస్క్‌ఫోర్స్

- రేవంత్ సర్కార్ సీరియస్ యాక్షన్
- ముగ్గురు సభ్యులతో నాణ్యత పరిశీలన
- హాస్టళ్లు, గురుకులాలు, అంగన్‌వాడీల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

2 లో

## మూసీని బాగుచేస్తే వద్దంటామా?

### నిర్వాసితుల కోసమే మా పోరాటం

- వాస్తవాలు దాచిపెడుతున్న ప్రభుత్వం
- కొత్తగా ఇండ్లను కూల్చబోమని రేవంత్ అంటున్నారు
- మరి ఇప్పటికే కూల్చిన వాటి పరిస్థితి ఏంటి?
- రేవంత్.. మూసీపై చర్చిద్దాం.. ఎక్కడికి రావాలో నువ్వే చెప్పు
- మాజీ మంత్రి హరీశ్ రావు

2 లో



## కేటీఆర్.. ఇథనాల్ పరిశ్రమపై చర్చిద్దామా?

- దానికి అనుమతులు ఇచ్చిందెవరు?
- బీఆర్ఎస్ నేత వియ్యంకుడిది కాదా ఆ కంపెనీ
- తలసాని కొడుకు డైరెక్టర్ గా లేరా?
- గ్రామసభలు పెట్టకుండా పరిశ్రమ నెలకొల్పలేదా?
- ఇప్పుడేమో బాధితులను రెచ్చగొడతారా?
- మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు

2 లో

## కేటీఆర్.. క్షమాపణ చెప్పు..

- ఐఏఎస్‌ల గౌరవాన్ని దెబ్బతీశారు
- సిరిసిల్ల కలెక్టర్‌కు క్షమాపణలు చెప్పాలి
- ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్
- కేటీఆర్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
- కలెక్టర్‌కు ఐపీఎస్ అధికారుల సంఘం సపోర్ట్

2 లో



## రుణమాఫీ రెండో విడతకు రెడీ

- రేపు రైతుల ఖాతాల్లోకి నిధులు
- 3 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి తుమ్మల

2 లో





## కొండా సురేఖకు కింగ్ దెబ్బ

- మంత్రికి సమన్లు జారీ చేసిన నాంపల్లి కోర్టు
- డిసెంబరు 12న విచారణకు రావాలని ఆదేశాలు
- వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిందే
- క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటున్న నాగార్జున

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నాగార్జున ఫ్యామిలీపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల అంశంలో మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. నాగార్జున వేసిన పరువు నష్టం కేసులో డిసెంబరు 12న విచారణకు హాజరుకావాలని కొండా సురేఖను న్యాయస్థానం ఆదేశించింది. నాగార్జున ఫిటిషన్ ను గురువారం పరిశీలించిన న్యాయస్థానం సురేఖ తప్పనిసరిగా కోర్టు ఎదుట హాజరైన వివరణ ఇవ్వాలని సూచించింది. తన ఫ్యామిలీని కించపరిచేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ ఫిటిషన్ దాఖలు చేసిన నాగార్జున.. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని

2 లో

## మాజీ మంత్రుల్లో వణుకు..!

- త్వరలో అమోయ్ కుమార్ అరెస్ట్..?
- భూదాన్ భూముల వ్యవహారంలో కీలక పరిణామం
- రాష్ట్ర పోలీసులకు ఈడీ నివేదిక
- పలు అక్రమాలు జరిగినట్లు గుర్తింపు
- అమోయ్‌పై కేసు నమోదు చేయాలని సిఫార్సు
- ఎమ్మార్వో, ఆర్డీవోలపైనా కేసు పెట్టాలని సూచన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భూదాన్ భూముల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విషయంలో ఈడీ అధికారులు.. డీజీపీకి నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా భూదాన్ వ్యవహారంపై కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి అమోయ్ కుమార్‌తో పాటుగా మిగతా అధికారులపై కూడా కేసులు నమోదు చేయాలని నివేదికలో ఈడీ సిఫారసు చేసింది.రాష్ట్రంలో భూదాన్ భూముల వ్యవహారంలో ఈడీ దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలోనే ఈ కేసుకు సంబంధించి డీజీపీకి ఈడీ నివేదికను సమర్పించింది. ఈ సందర్భంగా



2 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
29.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# ప్రియాంకా అనే నేను..

తరువాయి భాగం



ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్యాంగ ప్రతిని చేతబూని ఆమె ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో అరంగేట్రం చేసిన కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ.. తొలి అడుగులోనే భారీ విజయాన్ని నమోదు చేశారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో తన సమీప ప్రత్యర్థి పై 4,10,931 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఇదే స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన (3.64 లక్షలు) మెజార్టీని ఆమె అధిగమించారు. ఎంపీ హోదాలో మొదటి సారి లోక్‌సభలోకి అడుగుపెట్టారు.

వయనాడ్‌లో విజయంతో.. నెహ్రూగాంధీ కుటుంబంలో దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహించిన మూడో వ్యక్తిగా ప్రియాంక గుర్తింపు పొందారు. ఇదివరకు ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహించారు. సోనియా గాంధీ కూడా కర్ణాటకలోని బళ్లారి నుంచి పోటీ చేసి విజయం సాధించినప్పటికీ.. అమేఠీలోనూ గెలిచిన ఆమె ఆ తర్వాత దాన్ని వదులుకున్నారు. ఇక, ప్రియాంక రాకతో ఇప్పుడు ఒకేసారి ముగ్గురు నెహ్రూగాంధీ కుటుంబ సభ్యులు పార్లమెంటు ఎంపీలుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సోనియా గాంధీ రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. రాహుల్ రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ప్రియాంకతో పాటు నాందేడ్ ఉప ఎన్నికలో విజయం సాధించిన కాంగ్రెస్ నేత రవీంద్ర వసంతరావ్ చవాన్ కూడా నేడు ప్రమాణం చేశారు.

**కొనసాగుతున్న వాయిదాల పర్వం**

అదానీ వ్యవహారంతో ఉభయసభల కార్యకలాపాలకు గురువారం కూడా అంతరాయం కలిగింది. దానిపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో తొలుత వాయిదా పడిన రెండు సభలు మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి ప్రారంభమయ్యాయి. అయితే పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో తిరిగి శుక్రవారానికి వాయిదాపడ్డాయి.

## కొండా సురేఖకు కింగ్ దెబ్బ

తరువాయి భాగం



డిమాండ్ చేశారు. అక్కినేని నాగ చైతన్య, సమంత విడాకుల విషయంలో కొండా సురేఖ తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున్న దుమారం రేగడంతో తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెప్పింది సురేఖ. అయినా ఏ మాత్రం తగ్గని నాగార్జున తన కుటుంబానికి భంగం కలిగించారంటూ లీగల్ నోటీసులు పంపంచారు.

# కేటీఆర్.. ఇథనాల్ పరిశ్రమపై చర్చిద్దామా?

- దానికి అనుమతులు ఇచ్చిందెవరు?
- బీఆర్ఎస్ నేత వియ్యంకుడిది కాదా ఆ కంపెనీ
- తలసాని కొడుకు డైరెక్టర్ గా లేరా?
- గ్రామసభలు పెట్టకుండా పరిశ్రమ నెలకొల్పలేదా?
- ఇప్పుడేమో బాధితులను రెచ్చగొడతారా?
- ఫుడ్ పాయిజనింగ్ ఘటనల వెనక కుట్ర ఉందేమో..
- మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమకు బీఆర్ఎస్ హయాంలోనే అనుమతులు ఇచ్చారని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద ఆమె గురువారం మీడియాతో మాట్లాడారు. ఫ్యాక్టరీ విషయంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే పరిశ్రమకు అనుమతులు ఎవరిచ్చారో మాట్లాడదామని.. దిలావర్‌పూర్ రావాలని సవాల్ విసిరారు. 'బీఆర్ఎస్ హయాంలో ఎన్నో పరిశ్రమలకు కనీసం గ్రామసభలు కూడా నిర్వహించకుండానే అనుమతులిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన లక్షల ఎకరాల అసైన్డ్ భూములను రియల్ ఎస్టేట్ కోసం తీసుకున్నారు. ఇప్పుడు మాత్రం గ్రామసభల్లో ఒకరిద్దరిని రెచ్చగొట్టి అధికారులపైకి ఉసిగొల్పుతున్నారు. ఇథనాల్ పరిశ్రమలో డైరెక్టర్‌గా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకుడు ఏపీకి చెందిన పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు ఉన్నారు. ఆ పరిశ్రమకు అనుమతులు ఇచ్చే సమయానికి మరో డైరెక్టర్‌గా తలసాని కుమారుడు సాయి ఉన్నారు.' అని పేర్కొన్నారు,

**అక్కడే తేలుద్దాం..**

'దిలావర్‌పూర్‌లో కర్మాగారం ఏర్పాటు చేయించి రైతులను ముంచే ఆలోచన చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఇప్పుడు అదే పార్టీ రైతులను రెచ్చగొట్టి ప్రభుత్వంపై కుట్రలు చేస్తోంది. 2023, ఏప్రిల్ 3న అప్పటి ప్రభుత్వం ఇథనాల్ కర్మాగారం ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది. 2023, జూన్ 15న కాళేశ్వరం ప్యాకేజీ నెం.27 నుంచి ఏడాదికి 18.351 ఎంసీఎఫ్‌టీ నీళ్లను కేటాయిస్తూ నీటి పారుదల శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. కేటీఆర్.. ఎక్కడెక్కడో తిరగడం ఎందుకు.?. ఆందోళన జరుగుతున్న ప్రాంతానికే వెళ్దాం. ఎవరు అనుమతులిచ్చారో అక్కడే తేలుద్దాం. మీ హయాంలోనే పరిశ్రమకు అనుమతులిచ్చినట్లు ఇప్పటికైనా ఒప్పుకోవాలి. ఈ అంశంపై ఆధారాలతో సహా త్వరలోనే వాస్తవాలు వెల్లడిస్తాం. తప్పుడు ప్రచారాలతో ఎక్కువ రోజులు మనుగడ సాగించలేరు.' అంటూ సీతక్క మండిపడ్డారు.

**ఫుడ్ పాయిజన్ ఘటనలపైనా..**

మరోవైపు, ఫుడ్ పాయిజన్ ఘటనలపైనా మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అన్నారు. దీని వెనుక ఎవరున్నారనేది బయట పెడతామని చెప్పారు. కుట్రదారులు వెనుక అధికారులు ఉంటే ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించారు. ఇందులో రాజకీయ పార్టీ కుట్ర ఉందంటూ అనుమానం వ్యక్తం చేశారు. జరుగుతున్నది ఆహార కలుషితం కాదని.. రాజకీయ కలుషితమని ఆరోపించారు.



# ఫుడ్ పాయిజన్‌పై టాస్క్‌ఫోర్స్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలోని విద్యాసంస్థల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ అవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో.. రేవంత్ రెడ్డి సర్కార్ సీరియస్ యాక్షన్‌లోకి దిగింది. పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులకు పెట్టే ఫుడ్ క్వాలిటీపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఫుడ్ పాయిజన్ ఘటనలపై నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీలు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్లకు సీఎం శాంతి కుమారి కీలక ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణలోని గురుకులాలు, పాఠశాలల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగులోకి వస్తుండటం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. కుమురం భీ ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన శైలజ అనే విద్యార్థిని ప్రాణాలు కోల్పోవటం.. నారాయణపేట జిల్లాలోని మాగనూరు పాఠశాలలో వారం రోజుల వ్యవధిలోనే మూడుసార్లు ఫుడ్ పాయిజన్‌లో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికావటం ప్రస్తుతం ఆందోళనకరంగా మారింది. అయితే.. ఈ ఘటనల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచే కాకుండా విపక్షాల నుంచి కూడా తీవ్రస్థాయిలో ఆందోళనలు వ్యక్తమవుతుండటంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్ యాక్షన్‌లోకి దిగింది. ఇందులో భాగంగానే.. పాఠశాలల్లో పెడుతున్న ఫుడ్ క్వాలిటీపై స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించగా.. ఫుడ్ పాయిజన్ ఘటనలకు సంబంధించిన కారణాలను తేల్చేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

అయితే.. ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్, అదనపు డైరెక్టర్, జిల్లా స్థాయి అధికారి ఉండనున్నారు. ఈ కమిటీ సభ్యులు.. గురుకులాలు, పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీలు, ఆస్పత్రుల్లోని ఆహార నాణ్యతను పర్యవేక్షించనున్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడు.. కారణాలు తేల్చి, బాధ్యులను గుర్తించనున్నారు. టాస్క్‌ఫోర్స్‌తో పాటు రాష్ట్రంలోని గురుకులాల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలను కూడా రేవంత్ రెడ్డి సర్కారు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో పాఠశాల హెడ్ మాస్టర్‌తో పాటు, ఇద్దరు సిబ్బంది కూడా ఉండనున్నారు.

ఈ ఫుడ్ సేఫ్టీ కమిటీలు.. వంట చేసే ముందు కిచెన్‌ను నిశితంగా పరిశీలించి పరిశుభ్రతను నిర్ధారించాల్సి ఉంటుంది. ఆ తర్వాత వంటయ్యాక కూడా అధికారులు క్వాలిటీ చెక్ చేయాల్సి ఉంటుంది. ఫుడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు భోజనం రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఫేడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎస్ శాంతి కుమారి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.



# పదో తరగతి పరీక్షలో కీలక మార్పులు

- ఇంటర్నల్ మార్కులకు స్వస్తి
- ఇకపై 100 మార్కులకు పేపర్
- 2024-25లో నూతన విధానం
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పదో తరగతి పరీక్షల మార్కులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇంటర్నల్ 20 మార్కులకు స్వస్తి పలకబోతున్నట్లు ప్రకటించింది. ఇకపై 100 మార్కులకు పేపర్ ప్రవేశపెట్టబోతున్నట్లు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఒక సబ్జెక్టుకు 100 మార్కులుండగా.. 20 ఇంటర్నల్, 80 ఎక్స్‌టర్నల్ మార్క్సుల విధానాన్ని అమలుచేస్తున్నారు. అయితే 202425 విద్యా సంవత్సరానికి ఇంటర్నల్ మార్కుల విధానాన్ని పూర్తిగా రద్దు చేసి నూతన విధానం అమల్లోకి తీసుకురాబోతున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది.

ఇందులో భాగంగానే పరీక్షల్లో ఆన్సర్ షీట్స్‌లోనూ మార్పులు చేసింది. ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులకు 12 పేజీల ఆన్సర్ బుక్‌లెట్స్, మిగతా సబ్జెక్టులకు 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్స్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరికీ సమాచారం చేరవేయాలని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# మూసీని బాగుచేస్తే వద్దంటామా?

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



ప్రజలు, పార్లమెంటును సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి, మున్సిపల్ మంత్రి రేవంత్ రెడ్డే అని తెలిపారు. సంబంధిత శాఖ మంత్రి సంతకంతోనే పార్లమెంటుకు సమాధానం వెళ్తుందని పేర్కొన్నారు. అంటే ఆయనకు తెలిసి కూడా కేంద్రానికి తప్పుడు సమాచారం అందించారని మండిపడ్డారు. కొత్తగా ఇండ్లను కూల్చబోమని అంటున్నారని.. మరి కూల్చిన వాటి సంగతేంటని ప్రశ్నించారు. వాళ్లు అనుభవించిన క్షోభ సంగతి ఏంటని నిలదీశారు. హైడ్రా పేరిట పేదల ఇండ్లను కూల్చారని హరీశ్‌రావు తెలిపారు. చిన్న పాప పుస్తకాలు తెచ్చుకుంటా అంటే ఊరుకోకుండా.. ఇండ్లు కూల్చేశారని.. దీనికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. పరిహారం ఇచ్చినా సరే వారు పడిన బాధ పోదని అన్నారు. కట్టుబట్టలతో ఇండ్ల నుంచి బయటకు గెంటేశారని.. మూసీ విషయంలోనూ అదే పరిస్థితి నెలకొందన్నారు. కూలిన ఇండ్లకు నష్టపరిహారం ఎలా చెల్లిస్తావని ప్రశ్నించారు. దుందుడుకు చర్యలతో పేదల ఉసురు తీసుకుంటున్నావని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. రాష్ట్రం పరువు తీస్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. 280 కుటుంబాల ఇండ్లను కూల్చేసినమని అంటున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఓల్డ్ మలక్‌పేట శంకర్‌నగర్‌లో ఒక ఇంట్లో 16 కుటుంబాలు ఉంటున్నాయని తెలిపారు. ఆ ఇల్లు కూల్చేసి, కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తే వాళ్లు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మానవత్వంతో ఇండ్లు ఇస్తున్నామని పార్లమెంటుకు చెప్పారని.. మానవత్వంతో కాదు.. హక్కుగా ఇవ్వాలని చెప్పారు. ఇల్లు పొందడం నిర్వాసితుల రాజ్యాంగ హక్కు అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గతంలో సోనియా గాంధీని బలి దేవత అన్నాడని.. ఇప్పుడు తల్లి అంటున్నాడని హరీశ్‌రావు విమర్శించారు. నిజంగా ఆమె మీద గౌరవం ఉంటే సోనియా గాంధీ తెచ్చిన భూసేకరణ చట్టం 2013ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మూసీ బాధితులకు పరిహారం విషయంలో పార్లమెంటుకు చెప్పిన అంశాలపై చర్చించేందుకు సిద్ధమని తెలిపారు. ఎక్కడికి రావాలో ముఖ్యమంత్రి చెప్పాలని సవాలు విసిరారు. బుల్డోజర్ ఎక్కించి చంపుతా, తొక్కుతా అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం కాదని హరీశ్‌రావు అన్నారు. దీనికి ఎక్కడికి రావాలన్నా సిద్ధమేనని బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. టీవీ చానల్‌కు వెళ్దామా.. సచివాలయానికి రావాలా అని అడిగారు. అఖిలపక్ష సమావేశం పెట్టాలని కేటీఆర్ చెప్పారని.. తాను కూడా చెప్పానని గుర్తుచేశారు. అఖిలపక్ష సమావేశం ఎందుకు పెట్టలేదని నిలదీశారు. పార్లమెంటును తప్పుదోవ పట్టిస్తున్నావని.. సోనియాగాంధీని తప్పుదోవ పట్టిస్తున్నావని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవానికి తాము వ్యతిరేకం కాదని హరీశ్‌రావు తెలిపారు. మూసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. మూసీ ముసుగులో రాష్ట్ర ప్రభుత్వ నిధులు కొల్లగొట్టడానికి వ్యతిరేకమని చెప్పారు. మూసీ ప్రాజెక్టు ప్రారంభించిందే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. అవాసత్వాలు చెప్పడం మీద పార్లమెంటులో ప్రివిలేజ్ మోషన్ ఇస్తామని చెప్పారు. మూసీ పేదల పక్షాన న్యాయస్థానాలకు వెళ్తామని అన్నారు. చట్టం ప్రకారం ఆ పేదలకు సాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు అసెంబ్లీలో కూడా పోరాడతామని స్పష్టం చేశారు. మూసీ బాధితులకు పూర్తిగా అండగా ఉంటామని.. పోరాటం చేస్తామని తెలిపారు.

# కేటీఆర్.. క్షమాపణ చెప్పు..

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



సిరిసిల్ల కలెక్టర్ పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఖండించింది. సివిల్ సర్వీసెస్‌లో ముఖ్యమైన పదవిలో ఉన్న అధికారి ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే విధంగా మాట్లాడటం తగదని వ్యాఖ్యానించింది. ఓ జిల్లా కలెక్టర్‌ను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని కించపరిచేలా మాట్లాడటాన్ని తప్పుబట్టింది.సిరిసిల్ల కలెక్టర్ పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఖండించింది. సివిల్ సర్వీసెస్‌లో ముఖ్యమైన పదవిలో ఉన్న అధికారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడటం తగదని వ్యాఖ్యానించింది. ఓ జిల్లా కలెక్టర్‌ను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని కించపరిచేలా మాట్లాడటాన్ని తప్పుబట్టింది. కేటీఆర్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని.. సిరిసిల్ల కలెక్టర్‌కు కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

**నిరాధార ఆరోపణలు సరికాదు..**

మరోవైపు.. సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌పై కేటీఆర్ చేసిన అవమానకరమైన, నిరాధార ఆరోపణలను.. దుర్భాషలాడటాన్ని తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. సివిల్ సర్వీస్ అధికారిపై చేసిన విమర్శలు పాలనా విధానాలు, రాజ్యాంగ నిబద్ధత ఆధారంగా సివిల్ సర్వెంట్స్ నిర్వర్తించే బాధ్యతలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేటీఆర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లా కలెక్టర్ విధులను రాజకీయంగా వక్రీకరించే ప్రయత్నాలు సరికాదని తెలిపింది. సివిల్ సర్వీస్ అధికారిపై చేసిన విమర్శలు, నిరాధార ఆరోపణలు ప్రజస్వామ్య వ్యవస్థలపై చెడు ప్రభావాన్ని చూపిస్తాయని స్పష్టం చేసింది. సివిల్ సర్వీస్ అధికారుల గౌరవం కాపాడటానికి తాము అండగా నిలబడతామని తెలిపింది. కేటీఆర్ తన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని కోరింది. వ్యవస్థల గౌరవాన్ని, రాజ్యాంగం ద్వారా కల్పించిన న్యాయబద్ధతను గౌరవించే విధంగా వ్యవహరించాలని తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం సూచించింది. కాగా.. రెండు రోజుల క్రితం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో కేటీఆర్ జిల్లా కలెక్టర్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# మాజీ మంత్రుల్లో వణుకు..!

తరువాయి భాగం



రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్తో పాటు ఎంఆర్వో జ్యోతి, ఆర్డీవో వెంకటాచారిపై కేసు నమోదు చేయాలని ఈడీ రిపోర్టులో వెల్లడించింది. దర్యాప్తులో భాగంగా భూబదాయింపుల్లో చోటుచేసుకున్న లావాదేవీల్లో అనేక అక్రమాలు జరిగినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ కేసులో పలు అక్రమాలు జరిగినా గతంలో పోలీసులు కేసులు నమోదు చేయలేదని ఈడీ పేర్కొంది. ఈ నేపథ్యంలో అమోయ్ కుమార్‌తో పాటుగా మిగతా అధికారులపై కూడా కేసులో నమోదు చేసి విచారించాలని సిఫార్సు చేసింది. ఈడీ నివేదికలో మాజీ మంత్రుల్లో భయం మొదలైనట్లు తెలుస్తోంది. అమోయ్ కుమార్‌భూ దందాలో పలువురు మాజీ మంత్రుల హస్తం ఉన్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి విచారణ జరిపితే తమ పేర్లు ఎక్కడ బయటపడతాయోననే కొందరు నేతలు భయపడుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా భూదాన్ భూముల కేసులో అక్రమ లావాదేవీలపై భూదాన్ బోర్డు స్పందించింది. ఈ మేరకు గురువారం నాడు తహసీల్దార్ జ్యోతి తోపాటు మరో నలుగురికి నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 6న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో బోర్డు అధికారులు కోరారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
29.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## డ్రగ్స్ బారిన పడొద్దు

వారధి, స్టేట్ బ్యూరో:సీఎం రేవంత్ రెడ్డికి సినీ హీరో అల్లు అర్జున్ మద్దతుగా నిలిచారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఓ కార్యక్రమంలో డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై సినీ పరిశ్రమ యువతకు అవగాహన కల్పించాలని సూచించిన విషయం తెలిసిందే. టికెట్ రేట్ల పెంపు విషయంలో అనుమతి అంటూ వచ్చే వారికి ఆయన ఓ షరతు పెట్టారు. సినిమాలో నటించే వారితో డ్రగ్స్, సైబర్ నేరాలపై రెండు నిమిషాల అవగాహన వీడియో చిత్రీకరించాలని సీఎం సూచించారు. సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సినీ పరిశ్రమపై ఉందన్నారు. దీంతో పలువురు సినీ నటులు తమ సినిమాలు విడుదల అయ్యే ముందు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రముఖ టాలీవుడ్ నటుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గురువారం నాడు ఎక్స్ వేదికగా అవగాహన కల్పించే షార్ట్ వీడియో విడుదల చేశారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి సహకరించాలని అల్లు అర్జున్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ బారిన పడిన వాళ్ళు టోల్ ఫ్రీ నెంబర్ 1908కి కాల్ చేయాలని చెప్పారు.

# సీఎం రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతి

- రైతులకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటాం
- ప్రజా విజయోత్సలను విజయవంతం చేయండి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి, విశాలభారతి: ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలో భాగంగా ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా నెరవేరుస్తామని దీనిపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తూ వారికోసం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మహబూబ్నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్ వద్ద ఏర్పాటుచేసిన రైతు పండగ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో రైతు పండుగ పేరిట ఈనెల 28, 29, 30 తేదీలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, 30న చివరి రోజు జరిగే రైతు పండుగ పేరిట భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గము నుండి రైతులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈనెల 30న జరిగే రైతు పండుగకు కల్వకుర్తి నియోజకవర్గం నుండి పదివేల మంది రైతులను సభకు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అదేవిధంగా రైతు భరోసా, రెండవ విడత రైతు రుణమాఫీ చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే మరోసారి గుర్తు చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు ఎజాస్, బాలు నాయక్, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగన్, సంజీవ్ యాదవ్, మైనార్టీ నాయకురాలు రేష్మ, నాయకులు హనుమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా విజయోత్సవాలను విజయవంతం చేయాలి

ఆమనగల్లు,విశాలభారతి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తూ వారికోసం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. గురువారం ఆమనగల్లు పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో రైతు పండుగ పేరిట ఈనెల 28, 29, 30 తేదీలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని 30న చివరి రోజు జరిగే రైతు పండుగ పేరిట భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని సభను అత్యధికంగా రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎన్నికలలో ఇచ్చిన 6 గ్యారటీ హామీలతోపాటు మిగతా హామీలను తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. అదేవిధంగా గత ప్రభుత్వం కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కాలువల కోసం భూములు సేకరించిన రైతులకు నష్టపరిహారం అందివ్వ లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి ఆయన సొంత నియోజకవర్గమైన కల్వకుర్తి రైతులపై ఉన్న ప్రేమను దృష్టిలో ఉంచుకొని కాల్వల కోసం భూములు ఇచ్చిన రైతన్నలకు రూ . 50 కోట్ల నష్టపరిహారాన్ని అందివ్వడం జరిగిందని గుర్తు చేశారు. అదే విధంగా నియోజకవర్గంలో ఉన్న ఆర్ అండ్ బి రహదారుల కోసం అత్యధికంగా నిధులు మంజూరు చేయించడం జరిగిందని గుర్తు చేశారు. అదేవిధంగా రైతు భరోసా, రెండవ విడత రైతు రుణమాఫీ చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే మరోసారి గుర్తు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అజీమ్, జెల్ల రమేష్ గౌడ్, యాట నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, కిషన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జగన్, హనుమా నాయక్, విజయ్, మానయ్య, బిచ్చ, వెంకటయ్య, మోహన్ రెడ్డి, ఏదుల వెంకటరెడ్డి, కృష్ణా నాయక్, ఖాదర్, రహీం, మెకానిక్ బాబా, వాటర్ బాబా, సురేష్, యాదయ్య తదితరుల పాల్గొన్నారు.



## పట్ట భద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ఆర్మూర్,విశాలభారతి: నందిపేట మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోద కొరకు గురువారం శ్రీ సాయి డిగ్రీ కళాశాల మరియు కృష్ణవేణి పాఠశాలలో ఉపాధ్యాయులు మరియు 2021 విద్యార్థి సంవత్సరం లోపు పట్టభద్రులైన ప్రతి ఒక్కరిని ఓటు హక్కు నమోదు డిసెంబర్ 9 లోపు చేసుకోవాలని తెలంగాణ ఉద్యమకారులు ఉస్మానియా విశ్వవిద్యాలయ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజారాం యాదవ్ తెలిపారు. దళిత తాడిత పీడిత బడుగు బలహీన వర్గాల కోసం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు భావి సమాజ అభివృద్ధి అని నమ్మి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం శక్తివంచన లేకుండా కృషిచేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమ నాయకులు రాజారామ్ యాదవ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించి చట్టసభలకు పంపాలని నందిపేట్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ మచ్చర్ల సాగర్ కోరారు. ఈ కార్యక్రమంలో నందిపేట్ మండల నాయకులు ఓయు విద్యార్థి నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రుణమాఫీ రెండో విడతకు రెడీ

- రేపు రైతుల ఖాతాల్లోకి నిధులు
- 3 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి తుమ్మల



విశాలభారతి, స్టేట్ బ్యూరో: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నదాతలకు గుడ్‌న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో రుణమాఫీ జరగని సుమారు 3 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో ఈ నెల 30న మహబూబ్ నగర్‌లో జరగనున్న 'రైతు పండుగ' సందర్భంగా డబ్బులు జమ చేస్తామని ప్రకటించారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను బీఆర్ఎస్ పార్టీ అప్పుల పాలు చేసిందని విమర్శించారు. ఇంత అప్పుల్లో ఉన్నా, రూ.47 వేల కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించామని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఇప్పటికే 22 లక్షల మందికి రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని, తెల్లరేషన్ కార్డు లేకపోవడం, వివిధ టెక్నికల్ సమస్యలతో ఆగిపోయిన సుమారు 3 లక్షల మంది రైతులకు మహబూబ్‌నగర్‌లో ఈ నెల 30న జరగబోయే రైతు పండగ రోజు రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రైతును రాజును చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తామన్నారు.



## ప్రతిష్టాత్మకంగా 'దీక్షాదివస్'

- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో భారీగా ఏర్పాట్లు
- గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి

ఆర్మూర్,విశాలభారతి: 'దీక్షాదివస్' కార్యక్రమాన్ని నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.దీక్షాదివస్ కోసం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో భారీగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.దీక్ష దివాస్ సందర్భంగా ఉదయము 10 గంటలకు వినాయక్ నగర్ లో గల అమరవీరుల స్థూపానికి నివాళులర్పించే కార్యక్రమము జరుగుతుందన్నారు. ఉదయం 10.30 నిమిషాలకు జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసిన అనంతరం అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూల మాల వేసే నివాళులు అర్పిస్తామని జీవన్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్ లో దీక్ష దీవాస్ కార్యక్రమము జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం,ఫోటో ఎగ్జిబిషన్ చేసినట్లు ఆయన వెల్లడించారు.దీక్షాదివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,పట్టణ,మండల,గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



## భీమ్‌గల్ లో పూలె వర్ధంతి

బాల్కొండ,విశాలభారతి వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయులు, సామాజిక ఉద్యమకారులు, మార్గదర్శి శ్రీ మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్‌గల్ మండల కేంద్రంలో పూలే విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడిన తొలి సామజిక ఉద్యమకారుడు, అసమానతలు రూపు మాపడానికి సమానత్వమే ద్యేయంగా మహిళలకు కూడా విద్య అవసరమే అని చెప్పి దేశంలోనే మొట్ట మొదటి సారిగ బాలికలకు పాఠశాలలు ఏర్పాటుచేసిన గొప్ప సంఘ సంస్కర్త, స్వేచ్ఛ, సమానత్వం అనే నినాదంతో ఆనాడు నిమ్న జాతి ప్రజలపై జరిగిన కుల కుట్రలను చేదించి అట్టడుగు వర్గాల మానసిక బానిసత్వపు సంకెళ్ళ నుండి విముక్తి పొందించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పర్శ అనంతరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపాల్ నాయక్, పట్టణ అధ్యక్షులు జేజే నర్సయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్ది అవినాష్,కుప్కల్ మాజీ సర్పంచ్ బొర్రన్న,రాంరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

# నాచారంలో హైపర్ మార్ట్ – వాల్యూ జోన్

- హీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభం
- ఒకేచోట సమగ్ర రిటైల్ షాపింగ్
- ప్రారంభం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు





విశాలభారతి, హైదరాబాద్: పటాన్ చెరులో అద్భుత విజయం సాధించిన హైపర్ మార్ట్ వాల్యూజోన్, మరోసారి చరిత్ర సృష్టించేందుకు నాచారంలో సిద్ధమైంది. హైపర్ మార్ట్ బ్రాండ్ అంబాసిడర్ గా హైపర్ మార్ట్ తో అనుబంధం ఉన్న ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు నందమూరి బాలకృష్ణ నవంబర్ 28న దీన్ని ప్రారంభించారు.

వాల్యూజోన్ హైపర్ మార్ట్ ఆలోచన పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు, దివంగత పి.సత్యనారాయణ గార్లది. మారుతున్న రిటైల్ ఫార్మాట్ ను రూపొందించాలనే వారి సామూహిక దృష్టి ఈ విస్తారమైన షాపింగ్ గమ్యస్థానంగా మారింది. ఫ్యాషన్, కిరాణా సరుకులు, ఫుట్ వేర్, లగేజ్, ఫర్నిషింగ్, స్టేషనరీ, సాధారణ సరుకులతో పాటు ప్రఖ్యాతి గాంచిన ప్రపంచ మరియు భారతీయ బ్రాండ్లను వినియోగదారులకు అందించడంపై దృష్టి సారించి, ఒకేచోట సమగ్ర రిటైల్ షాపింగ్ అనుభవాన్ని అందిస్తోంది వాల్యూ జోన్. రాయితీ బ్రాండెడ్ ఉత్పత్తుల ద్వారా వినియోగదారులు రోజంతా షాపింగ్ చేయగలిగేలా, మరియు ఫ్యాషన్, ఆహారం, వినోదాలతో కూడిన ప్రత్యేకమైన రిటైల్ అనుభవాన్ని ఆస్వాదించడానికి ఔట్ లెట్ మాల్ గా రూపొందించబడుతోంది.

వాల్యూజోన్ తో గల అనుబంధం గురించి నందమూరి బాలకృష్ణగారు మాట్లాడుతూ, "వాల్యూజోన్ ఖచ్చితంగా గొప్ప రిటైల్ ఫార్మాట్. దాని ఉత్పత్తుల శ్రేణి, షాపింగ్ అనుభవం సాటిలేని రీతిలో హైదరాబాద్ కు గర్వకారణంగా మారుతోంది. వాల్యూ జోన్ లోని కలెక్షన్లు, బ్రాండ్లు, ఆహ్లాదకరమైన సమయం వినియోగదారుల కోసం వేచి ఉన్నాయని తెలిపారు.

**వన్-స్టాప్ ఫ్యామిలీ షాప్**

ఫ్యాషన్, నిత్యావసర సరుకులు, సాధారణ వస్తువులపై 365 రోజులూ అద్భుతమైన ఆఫర్లు ఉంటాయి. 2000+ ఉత్పత్తులు ఒక వస్తువు కొనుగోలుపై మరొకటి పొందే అవకాశం, విస్తృతమైన స్టాక్ తో పెద్ద మొత్తంలో ఆదా. 10,000+ కిరాణా వస్తువులు,, బహుళ వస్త్రాల బ్రాండ్ల నుండి 1000+ ఉత్పత్తులు కలవు. పురుషుల కొరకు ఎంచుకోవడానికి 100 కంటే ఎక్కువ జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు , 2000+ రకాల సిల్క్ చీరలు ప్రతి సందర్భం, సంప్రదాయం మరియు శైలికి అనుకూలంగా వాల్యూజోన్ వినోదం, సౌకర్యం మరియు ఆహ్లాదకరమైన షాపింగ్ ను కలిపే రిటైల్ అనుభవాన్ని పంచుతుంది. వాల్యూజోన్ ను హైదరాబాద్ లో మరియు బయట పలు ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
29.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## వేంకటేశ్వర కళ్యాణానికి పిసిసికి ఆహ్వానం

బాల్కొండ,విశాలభారతి

భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని చొక్కయ్య గుట్ట పై వేంకటేశ్వర స్వామీ కళ్యాణం వచ్చే నెల 3 న జరగనుంది. ఈ కళ్యాణ మహోత్సవంకి హైదరాబాద్ గాంధీ భవన్ లో టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని భీమ్‌గల్ పట్టణ నాయకులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. భీమ్‌గల్ మండల కేంద్రంలో చొక్కయగుట్టపై శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి వచ్చే నెల మంగళవారం అంగరంగా వైభవంగా జరిగే కళ్యాణానికి రావాలని కమిటీ సభ్యులు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బోధిరే స్వామి విశాల్ అరిగేలా జనార్దన్ గంగన్న బిదిరే గంగారాం తదితరుల వున్నారు.



## స్టాళ్లను రైతులు సద్వినియోగ పరుచుకోవాలి

- రవీందర్ రావు, గంప వెంకటేష్ గుప్తా

ఆమనగల్లు, విశాలభారతి :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రైతు పండుగ పేరిట ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 28, 29, 30వ తేదీలలో మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు అవగాహన స్టాళ్లను రైతన్నలు సద్వినియోగపరుచుకోవాలని తెలంగాణ రాష్ట్ర సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రవీందర్ రావు, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తాలు తెలిపారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రవీందర్ రావు, డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్లు గంప వెంకటేష్ గుప్తా లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు రైతు పండుగ పేరిట రైతన్నల అభివృద్ధి సంక్షేమమే, ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. డిసిసిబి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన స్టాళ్లను గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతన్నలు సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ స్టాళ్ళ లో రైతన్నల విత్తనాల ఎంపిక నుంచి పంట సేకరణ, పండించేంతవరకు ప్రతి అంశంపై గ్రామీణ ప్రాంత రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం రైతన్నలకు మంచి అవకాశం దక్కిందన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు సూచనలను పాటించి పంటలను సాగు చేసి అధిక దిగుబడి పొంది.. లబ్ధి పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్లు రంగారెడ్డి, వెంకటయ్య, భీమ్ రెడ్డి, భూపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి సీపిఎం సూర్యాపేట జిల్లా తృతీయ మహాసభలు

- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆహ్వాన సంఘం.
- నేడుబహిరంగ సభ.
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాక..





సూర్యాపేట, విశాలభారతి

సిపిఎం సూర్యాపేట జిల్లా తృతీయ మహాసభలు నవంబర్ 29,30, డిసెంబరు 1 తేదీలలో పోరాటాల పురిటిగడ్డ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కేంద్ర బిందువుగా ఉన్న సూర్యాపేట జిల్లా కేంద్రంలో సిపిఎం పార్టీ జిల్లా మహాసభలు జరుగుతున్నాయి. ఈ మహాసభల విజయవంతం కై గత 20 రోజులుగా 8 కమిటీలుగా ఆహ్వాన సంఘంగా ఏర్పడి మహాసభల విజయవంతం కై ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మహాసభల ప్రచారం కోసం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రధాన వీధుల్లో వాల్ రైటింగ్, సిపిఎం పార్టీ జెండాలు,తోరణాలు, ఫ్లెక్సీలతో అలంకరణ చేశారు. దీంతో సూర్యాపేట పట్టణం ఎర్రమయంగా తయారు అయింది. ఈ మహా సభలకు జిల్లా వ్యాప్తంగా 500 మంది ఎంపిక చేసిన ప్రతినిధులుల తో పాటుఆహ్వానితులు, సీనియర్ సిటిజన్స్ ఈ మహాసభలో పాల్గొంటున్నారు. సూర్యాపేట పట్టణంలో మహాసభల ప్రచారానికై మైక్ ప్రచారం విస్తృతంగా చేపట్టారు. మహాసభల నిర్వహణకోసం జిల్లావ్యాప్తంగా సిపిఎం పార్టీ శ్రేణులు ఇంటింటికి సిపిఎం పేరుతో ప్రజల వద్దకు వెళ్లి మాస్ ఫండ్ క్యాంపెయిన్ చేపట్టగా ప్రజల నుండి విస్తృతంగా స్పందన వచ్చింది.

**నేడు బహిరంగ సభ..**

సిపిఎం పార్టీ జిల్లా మహాసభల ప్రారంభం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో వేలాది మందితో బహిరంగ సభనిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కుడ కుడ రోడ్డులోని భాగ్యలక్ష్మి రైస్ మిల్లు నుండి ప్రజా ప్రదర్శన ప్రారంభం కానుంది. ఈ ప్రదర్శనకు ముందు 1000 మంది యువకులచే రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు జరగనుంది. ఈ కవాతు విజయవంతంకై వివిధ మండలాల్లో యువకులకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ప్రదర్శనలో 500 మంది కోలాట దళం, డప్పు కళాకారులతో పాటు విచిత్ర వేషధారణలు ఉంటాయి. ర్యాలీ అనంతరం వేలాది మందితో గాంధీ పార్కులో బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం,సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుజూలకంటి రంగారెడ్డి,మల్లు లక్ష్మిహాజరవుతున్నారు.

**మహాసభలకు ఏర్పాట్లు పూర్తి.**

ఈనెల 29,30, డిసెంబర్ 1 తేదీలలో జరిగే సిపిఎం పార్టీ జిల్లా తృతీయ మహాసభల ఏర్పాట్లు పూర్తి అయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి అన్నారు. మహాసభల సందర్భంగా ఈనెల 29న గాంధీ పార్క్ లో జరిగే బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. మహాసభల సందర్భంగా రెండు రోజులపాటు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు.



## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆకునూరు విద్యార్థులు

- అభినందించిన ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి

సైదాపూర్ విశాల భారతి

మండలంలోని ఆకునూరు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పొడిశెట్టి సంజన, రాయిశెట్టి రాహుల్, పెద్ది సాత్విక లు అండర్ 17 విభాగంలో రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపిక కాగా గురువారం క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి అభినందించారు. ఈనెల 9న కేశవపట్నం మండల కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికై ఈనెల 30 నుండి డిసెంబర్ 2 వరకు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బెనపల్లి ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ గిరుమల్ల నిర్మలను అభినందించారు. తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ గిరుమల్ల నిర్మల ఉపాధ్యాయులు ఠాగూర్ శాంత కుమార్ సింగ్ గూడూరి రవీందర్ రెడ్డి గోదారి సమ్మయ్య బైరి సుధాకర్ హన్మండ్ల భాస్కర్ హరియా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



## పూలే ఆశయాలను కొనసాగిద్దాం

సూర్యాపేట,విశాలభారతి:

మహాత్మా జ్యోతిరావు పూలే 134 వర్ధంతి సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించటం జరిగింది. ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టీ.యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే భారతీయ సామాజిక సంఘ సంస్కర్త, మహారాష్ట్రకు చెందిన రచయిత. సమాజంలోని సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా , స్త్రీ పురుష సమానత్వంకై కృషి చేసిన మహనీయులు జ్యోతిరావ్ పూలే. ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశాడని అన్నారు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి జంటగా భారతీయు చరిత్రలో నిలిచారని, ప్రతి ఒక్కరూ మన భారత ప్రథమ సామాజికతత్వవేత్త అయిన పూలే అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. లగచర్ల బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న పిడిఎస్యు రాష్ట్ర బృందాన్ని పరిగి పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరైనది కాదని ఖండించారు. అరెస్ట్ చేసిన పిడిఎస్యు నాయకులు వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు రాజు, వేణు, సందీప్, వినయ్, నవీన్, మహేష్, ప్రదీప్, శ్రీను, పవన్, శ్రీమాన్ పాల్గొన్నారు.




## సంక్షేమ హాస్టలో ఆహారాన్ని పరిశీలన చేయాలి

- మెనూ ప్రకారం ఆహారం అందించాలి.
- సంక్షేమ భవనాల మైనర్ రిపేర్స్ వెంటనే పూర్తి చేయాలి.
- కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవార్.

సూర్యాపేట,విశాలభారతి:

ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ నందు విద్యార్థుల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశ మందిరం నందు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఫ్రీ పోస్ట్ మెట్రిక్యులేషన్ హాస్టల్స్ సంక్షేమ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలోకలెక్టర్ తేజస్ మాట్లాడుతూ వసతి గృహాల సంక్షేమ అధికారులు స్థానికంగా ఉంటూ ప్రతి రోజు హాస్టల్స్ ను పరిశుభ్రంగా ఉంచాలని , విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, త్రాగునీరు ఫిల్టర్ చేసి అందించాలని, మిషన్ భగీరథ నీరు వచ్చే హాస్టల్స్ నందు లీకేజీ సమస్య లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ భవనాలలో ఉన్న హాస్టల్స్ నందు శానిటేషన్, ఎలక్ట్రిసిటీ, మరుగుదొడ్ల సమస్య లేకుండా చూసుకోవాలని ఏమైనా మైనర్ రిపేర్లు ఉంటే వెంటనే రిపైర్స్ చేయించాలని, అలాగే ప్రైవేటు భవనాల్లో రిపేర్స్ ఉంటే యజమానితో చెప్పి చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు భోజనాలు, టిఫిన్స్ తయారు చేయు వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట తయారు చేసే మహిళలు చేతులను, వంట పాత్రలను శుభ్రంగా డిటర్జెంట్ తో కడగాలని, బియ్యం లో పురుగులు లేకుండా చూసుకోవాలని వంటలలో వాడు సరుకులు గడువు తేదిని పరిశీలించి వాడాలని, వంటలకు ఉపయోగించు నీరు బయటకు వెళ్లే విధంగా చూసుకోవాలని, ఆహారాన్ని తయారు చేశాక ఫుడ్ కమిటీ వారు క్వాలిటీ, మెనూ ప్రకారం ఉన్నదా లేదా అని రుచి చూసి చూడాలని కలక్టర్ అధికారులను ఆదేశించారు. హాస్టల్ గదుల కిటికీల తలుపులు మంచిగా ఉండాలని, వాటికి మెస్ జాలీలు అమర్చుకోవాలని, ఎలక్ట్రికల్ సమస్యలు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చందుపట్ల వార్డెన్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ నందు ర్యాగింగ్ సమస్య లేకుండా చూసుకోవాలని, ప్రతి హాస్టల్ నందు ఫిర్యాదుల బాక్సులు పెట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రీ మెట్రిక్ హాస్టల్స్ నందు మైనర్ రిపేర్లు నిమిత్తము ఒక లక్ష రూపాయలు కేటాయించు చున్నానని, వెంటనే రిపేర్లు చేయించుకోవాలని హాస్టల్ వార్డెన్ లను ఆదేశించారు. మిగతా హాస్టల్స్ అనగా ఎస్సీ, ఎస్టీ సొంత భవనాలకు బడ్జెట్ కేటాయింపులు జరిగిన వాటికి రిపేర్లు వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలేక్టర్ పి. రాంబాబు,ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ అధికారులు లత, శంకర్, అనసూర్య జిల్లాలోని ఫ్రీ, పోస్ట్ మెట్రిక్యులేషన్ హాస్టల్స్ సంక్షేమ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థికబలం లేక రాజకీయంగా మనం ఎదగలేకపోతున్నాం

- మనలో ఎదుతున్న వారికి ప్రతి ఒక్కరు సహకరించాలి.
- కొండ లక్ష్మణ్బాపూజీ విగ్రహ ఏర్పాటుకు కృషి
- తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం కమర్తపు మురళి
- ప్రమాణస్వీకారం చేసిన పట్టణ ప్రాంత పద్మశాలి సంఘం నూతన కమిటీ

సూర్యాపేట, విశాలభారతి:

విద్యాపరంగా ఇప్పుడిప్పుడే పద్మశాలిలు అభివృద్ధిలోకి వస్తున్నప్పటికి ఆర్థికబలం లేక రాజకీయంగా ఎదగలేకపోతున్నామని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి అన్నారు. గురువారం స్థానిక పద్మశాలి భవన్లో సూర్యాపేట పట్టణ ప్రాంత పద్మశాలి సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1921లో స్థాపించిన అఖిల భారత పద్మశాలి సంఘానికి అనుబంధంగా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ పట్టణ ప్రాంత పద్మశాలి సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సంఘానికి 103 సంవత్సరాలు చరిత్ర ఉందన్నారు. సమాజంలో ఏ కుల సంఘం రాక ముందే మొట్ట మొదటిగా పద్మశాలి కులస్తులు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారని గుర్తు చేశారు. పద్మశాలిలు ఇప్పుడు విద్యాపరంగా బాగానే ఉన్న ఆర్థికంగా ఎదగలేకపోతున్నారని, ఇందుకు మనం ఎంచుకున్న చేనేత వృత్తి కూడా కారణంగా చెప్పవచ్చన్నారు. పొద్దంతా పని చేస్తే నెలకు 12వేల రూపాయలు వస్తే అవి కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొడ్డు గోవిందరావు, నల్లగొండ జిల్లా అధ్యక్షులు పొట్టబత్తుల సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, మహిళా అధ్యక్షురాలు నక్కా రమాదేవి, నాగుల వాసు, జిల్లా కార్యదర్శి సైదులు, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద హేమలత, ఉద్యోగ సంఘం అధ్యక్షులు నగేష్, యువజన అధ్యక్షులు సిలివేరు సతీష్, ప్రధాన కార్యదర్శి ఎలె ప్రభాకర్, చేనేత విభాగం అధ్యక్షులు ముశం వెంకట నారాయణ తదితరులు ఉన్నారు.



## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలి

- జాయింట్ కలెక్టర్ కు వినతి

కల్వకుర్తి విశాలభారతి

కల్వకుర్తిలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇచ్చి ఇల్లు అప్పచెప్పాలని గురువారం కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద జాయింట్ కలెక్టర్ ను కలిసి డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల పోరాట సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు కేటాయించి దాదాపు 18 నెలలు గడిచి పోయిందని.. ఇప్పటికే ఒక దఫా వాటర్ ట్యాంకులు డామేజ్ అయ్యాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి విషయం తీసుకెళ్లగా పెండింగ్ లో ఉన్నటువంటి పనులన్నీ చేయించారని ప్రస్తుతం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇచ్చి ఇండ్లు అప్పచెప్పితే పేదలకు ఇంటి అద్దెలు కట్టే భారం తగ్గుతుందని అన్నారు. కండ్లకు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారని దయచేసి ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరినట్లు చెప్పారు . వినతి పత్రం ఇచ్చిన వారిలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు నరసింహ, కోశాధికారి శ్రీనివాసులు, బాలకృష్ణ తో పాటు లబ్ధిదారులు తెలిపారు.

## దీక్ష దివాస్ ను జయప్రదం చేయండి

ఆర్మూర్, విశాల భారతి.

శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద జరిగే దీక్ష దివాస్ ను జయప్రదం చేయాలని బి అర్ ఎస్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు దీక్ష దివాస్ ను నిర్వహిస్తున్నామని భా రస ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోల సుధాకర్, యువజన నాయకులు మీరా శ్రావణ్, అగ్గు క్రాంతి, మాక్లూర్ రాజు, అఖిల్ తదితరులు ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
29.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
5
vishalabharathi Telugu Daily






## ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతుంది

- ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ పట్ల మధు

**మహబూబాబాద్, విశాల భారతి:**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మదర్ తెరిసా సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల్లోకొచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో హాస్టల్లో ఫుడ్ పాయిజన్లు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

## డ్రైనేజీలో పడి చిన్నారి మృతి.

**ఆర్మూర్,విశాలభారతి:**

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 35వ వార్డులో డ్రైనేజీ లో పడి మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.మట్ట ధనశ్రీ (3) రాంనగర్ లోని ఇంటి ముందు ఆడుకుంటూ లోతైన డ్రైనేజీ లోపడి చిన్నారి మృతి చెందింది. చిన్నారి కాల్వలో పడిన విషయం గుర్తు తెలియక కాలనీలో చిన్నారి కోసం వెతికారు.చివరగా మురికి కాలువలో చూడగా చిన్నారి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు.చిన్నారిని కాలువ నుండి బయటకు తీయగా ఊపిరాడక మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నరు.

# శ్రీకాంతాచారి వర్ధంతిని యూత్ డే గా ప్రకటించాలి

- డిసెంబర్ 3 న జరిగే తెలంగాణ యూత్ డే గోడ పత్రిక ఆవిష్కరణ
- విద్యార్థి జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇరుగు మనోజ్

**మహబూబాబాద్, విశాలభారతి:**




తెలంగాణ జన సమితి అనుబంధ యువజన సమితి, విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 3 న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ యూత్ డే సదస్సును నిర్వహిస్తున్నట్టు విద్యార్థి జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇరుగు మనోజ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇరుగు మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమరుల స్ఫూర్తిని మరిచి పరిపాలన చేసింది. గత నాలుగు సంవత్సరాలుగా అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని "తెలంగాణ యూత్ డే" గా నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా నిరుద్యోగుల, యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశాము. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మేము లేవనెత్తిన జాబ్ క్యాలెండర్ ఏర్పాటు, రెగ్యులర్‌గా ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదల, మెస్ బిల్లుల పెంపు, స్కిల్ సెంటర్ల ఏర్పాటు తదితర డిమాండ్లను పట్టించుకోలేదు. కానీ 10 నెలల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వీటిని పరిష్కరించింది. గత పదేళ్ళ బీఆర్ఎస్ ప్రభుత్వం 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసింది. కానీ ఒక లక్షా యాభైవేల ఉద్యోగాలు భర్తీ చేశామని తప్పుడు ప్రచారం చేసుకుంది. పది నెలల ప్రజా ప్రభుత్వంలో 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. జాబ్ క్యాలెండర్ ద్వారా మరిన్ని నోటిఫికేషన్లను జారీచేస్తుంది. గత బీఆర్ఏస్ పాలనలో ప్రయివేటు, ఐటీ రంగాలలో కూడా తెలంగాణ భూమిపుత్రులకు ఉద్యోగాలు దక్కలేదు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేసి ఈ రంగాలలో ఉద్యోగ ఉపాధి కల్పన మీద దృష్టి పెట్టింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి నిరుద్యోగులు, యువత తరపున కృతజ్ఞత తెలుపుతున్నాం" అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో యువత సమగ్రాభివృద్ధికై ఒక యువజన విధానం రూపొందించాల్సి ఉంది. తెలంగాణ స్థానిక యువకులకే పరిశ్రమలలో మెజారిటీ ఉద్యోగాలు దక్కేలా ఒక ప్రత్యేక చట్టం రావాలి. అలాగే, గంజాయి, డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా తెలంగాణను నిర్మించుకోవాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్,రాము,నవీన్,యశ్వంతి పాల్గొన్నారు.



## అంటరానితనంపై పోరాటం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే

- డిసిసి ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్

**శాలిగౌరారం, విశాలభారతి:**

మహాత్మా జ్యోతిరావుపూలే 134వ వర్ధంతిని మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటానికి డిసిసి ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అన్నెబొయిన సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష, అంటరానితనం పై పోరాటం చేసి వెనుకబడిన బడుగు బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘసంస్కర్త మన మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం చాల సంతోషంగా ఉందన్నారు. పూలే కలలు కన్న సమాజం నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తూ,రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు కల్పించేందుకు కుల గణన నిర్వహిస్తున్నారన్నారు. జ్యోతి రావు పూలే సతీమణి సావిత్రి బాయ్ పూలే మహిళా అభ్యున్నతి కోసం వారికి విద్యను అందించారన్నారు. పూలే ఆశయ సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు దండ రేణుక అశోక్ రెడ్డి, అల్లి సైదులు, దండంపల్లి రామ నరసయ్య మాజీ ఎంపీటీసీ నోముల జనార్ధన్ కాంగ్రెస్ నాయకులు పెరమాండ్ల నరేష్, బోడ విజయ్ ,నోముల రవి,నిమ్మల కృష్ణ,గరికంటి శంకర్ ,వంగురి వెంకన్న ,కడారి అంజయ్య, పడాల రమేష్, రామచంద్రారెడ్డి, ఉబ్బనివెంకన్న ,లోడే సత్తయ్య,కర్నాటి కృష్ణ,గొల్ల రామచంద్రు, తదితరులు పాల్గొన్నారు.




## కడ్తాల్ గ్రామపంచాయతి అభివృద్ధి భేష్

- పల్లె ప్రగతి తో అద్భుత విజయాలు
- సిక్కిం రాష్ట్ర గ్రామ పంచాయతీల ప్రజా ప్రతినిధుల అభినందన

**ఆమనగల్లు, విశాలభారతి ::**

జాతీయ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ కేంద్రంలో గ్రామ పంచాయతీల పనితీరుపై రెండు రోజుల శిక్షణ పొందుతున్న సిక్కిం గ్రామపంచాయతీల ప్రజాప్రతినిధులు గురువారం కడ్తాల్ గ్రామపంచాయతీని సందర్శించారు. టీం కోఆర్డినేటర్ జరీనా నేతృత్వంలో కడ్తాల్ గ్రామపంచాయతిని సందర్శించారు. స్థానిక గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక అధికారిని ఎంపీడీవో సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ సొంత ఆదాయ నిధుల వివరాలను, వ్యయాలను ప్రత్యేక అధికారిని వివరించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు, మంచినీటి వసతి ఏర్పాటులో తీసుకుంటున్న జాగ్రత్తలను వివరించారు. గ్రామపంచాయతీ సిబ్బంది పనితీరును,పల్లె ప్రగతి, తెలంగాణకు హరితహారం, ప్రజాపాలన లాంటి కార్యక్రమ వివరాలను వారికి వివరించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన రైతు వేదిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామం, స్వయం సహాయక సంఘాల దుకాణాలు మరియు గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిక్కిం ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మరియు పాలకవర్గాన్ని అభినందించారు. పలువురు సిక్కిం ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ కడ్తాల్ గ్రామపంచాయతీ అభివృద్ధిలో రూపకల్పన చేయబడిన ప్రణాళిక మరియు అభివృద్ధి పనులు మిగతా గ్రామపంచాయతీలకు ఆదర్శవంతంగా నిలిచాయని తెలిపారు. కడ్తాల్ గ్రామపంచాయతీ ఇతర గ్రామపంచాయతీలకు ఆదర్శవంతమైన గ్రామపంచాయతీ అని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విజయ్ పాల్, ఐకెపి రాజేశ్వరి దేవి, మహిళా పొదుపు సంఘాల సభ్యులు, నాయకులు లాయక్ అలీ, మూడ అశోక్, చేగూరి మహేష్, క్యామ వెంకటేష్, కోశిక ఉపేందర్, కూకుట్ల మహేష్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## భక్తి భావాల పెంపుతోనే సమాజంలో శాంతి, సామరస్యాలు

- కడ్తాలలో మార్మోగిన అయ్యప్ప నామస్మరణ
- లక్ష్మి నర్సింహా రెడ్డి

**ఆమనగల్లు, విశాలభారతి :**

కడ్తాల్ గ్రామపంచాయతీ పరిధిలో కంటేకార్ మాధవి మనోహర్ దంపతుల ఆధ్వర్యంలో కుమారుడు శంతన్ కన్నె స్వామి ఏర్పాటు చేసిన మహా పడిపూజ కార్యక్రమానికి స్థానిక మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చుట్టుపక్కల ప్రాంతాల నుండి ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గురుస్వాములు మల్లారెడ్డి,విజయ్,రాజు, మహేష్,సత్యనారాయణ రెడ్డి పర్యవేక్షణలో వేదమంత్రాలచే గణపతి పూజ, అయ్యప్ప స్వామి అభిషేకం, మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించిన శంతన్, స్వాములను మాజీ సర్పంచ్ అభినందించారు. పూజ కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన బిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, నాయకులు తిరుమలేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కుల మతాలకు అతీతంగా అయ్యప్ప స్వాములకు అల్పాహార విందు

**ఆమనగల్లు, విశాలభారతి :**



కడ్తాల్ మండల కేంద్రంలో మక్త మధారం గ్రామంలో అయ్యప్ప మాలలో ఉన్నా స్వాములకు అల్పాహారం ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు షాబ్బుద్దీన్ అల్పాహారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతు కుల మతాలకు అతీతంగా అయ్యప్ప స్వాములకు అల్పాహార విందు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మతసమరస్యానికి ప్రతీకగా శబరిమలై వెళ్లే ప్రతి ఒక్క అయ్యప్ప భక్తుడు ప్రతి ఒక్కరు బాగుండాలని అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారని శాబ్బుద్దీన్ అన్నారు. అన్ని దానాల కంటే అన్నదాన అల్పాహారం గొప్పదని అందుకే భక్తులకు అల్పాహారం చేశానన్నారు. ఎంతో కఠోరమైన అయ్యప్ప దీక్ష చేస్తున్న భక్తులకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని, స్వామి వారి ఆశీస్సులు ఎల్లపుడూ స్వాములకు మరియు వారి కుటుంబాలకు ఉండాలని కోరారు.కుల మతాలు వేరైనా మానవత్వంతో సమభావనతో మెలగాలని కోరారు. అందులో భాగంగా అయ్యప్ప స్వాములకు అల్పహారం అందించడమే కాకుండా వారితో పాటు కలసి భుజించడం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో స్వాములు శ్రీకాంత్, బాలరాజ్, సాయి,అరుణ్, క్రాంతి మరియు తదితరులు ఉన్నారు.



## సమన్యాయం కోసం పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే

- బీసీ నేత ధనుంజయ నాయుడు

**నేరేడుచర్ల విశాలభారతి:**

సమన్యాయం కోసం జ్యోతిరావు పూలే నిరంతరం శ్రమించాడని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కొనియాడారు. సూర్యపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే వర్ధంతి సభలో పాల్గొన్న బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, బీసీ ఎస్ సి,ఎస్ టి మైనారిటీ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రాపోలు నవీన్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త,ఉద్యమకారుడు సంఘ సేవకుడు అయిన జ్యోతిరావు పూలే 19వ శతాబ్దంలోనే సామాజిక రుగ్మతలపై పోరాడినాడని, ముఖ్యంగా బాల్య వివాహాలు సర్వసాధారణంగా జరుగుతున్న ఆ రోజుల్లో బాల్య వివాహాలను వ్యతిరేకించడమే కాకుండా వితంతువుల పునర్వివాహానికి బాటలు వేశాడని అన్నారు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించడమే భారతదేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహానుభావుడు అని గుర్తు చేశారు. సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన మహాత్ముడు అని, అణగారినవర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు.

స్త్రీ స్వేచ్ఛ సాధకుడు సత్యశోధక్ స్థాపకుడు అని ఆయన అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు జిలకర రామస్వామి, యువజన విభాగం మండల అధ్యక్షుడు యల్లబోయిన సింహాద్రి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న,సామాజిక సేవా కార్యకర్త తక్కెళ్ళ నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కొమ్రరాజు వెంకట్, ఏఐవైఎఫ్ నాయకులు పరికే భరత్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ వసతి గృహం పరిశీలించిన ఎంపీడీఓ

**బాల్కొండ,విశాలభారతి**



భీమ్‌గల్ పట్టణంలోని ఎస్సీ బాలుర ప్రభుత్వ హాస్టల్ ను గురువారం ఎంపీడీఓ సంతోష్ కుమార్ తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సీ వసతి గృహం తనిఖీ చేయడం జరిగిందన్నారు. హాస్టల్ లోని సరుకులు భద్రపరిచే గది, వంటరూమ్, డైనింగ్ హాల్ ను పరిశీలించారు. స్టూడెంట్స్ కొరకు వంట చేసేందుకు తెచ్చి నిలువ చేసిన సరుకులు పరిశీలించారు. వండిన ఆహారం నాణ్యత చూశారు. స్టూడెంట్స్ కొరకు వంట చేసేటప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. వంట వండిన తదుపరి పాత్రలపై మూతలు ఉంచాలని సూచించారు. వంట సరుకులు మూత లు ఉన్న వాటిలోనే భద్రంగా ఉంచాలన్నారు. భోజనాలు రెడీ చేశాక వాటిని ఒకసారి తిని చూడాలని తెలిపారు.సరుకులు, కూరగాయలు నాణ్యమైన వాటిని మాత్రమే వంటకు ఉపయోగించాలని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచాలన్నారు. అనంతరం హాస్టల్ గదులు, ఫ్యాన్స్,విద్యుత్ సౌకర్యం, త్రాగు నీరు, టాయిలెట్స్ తదితర పరిశీలించారు.



## అయ్యప్ప ఆలయం వద్ద బోరుబావి పనులకు భూమి పూజ

**బాల్కొండ,విశాలభారతి**

భీమ్‌గల్ పట్టణంలోని చౌక్కయ్య గుట్ట వద్ద గల అయ్యప్ప ఆలయం వద్ద నీటి సౌకర్యార్థం బోరు బావి పనులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ముందుగా అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపినా అనంతరం బోరు బావి నిర్మాణానికి భూమిపూజా జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కన్నె సురేందర్, ఉపాధ్యక్షులు రాంగిరి రమేష్,ఆలయ కమిటీ సభ్యులు కొండల్ శ్రీనివాస్,కేటీ శ్రీనివాస్, సదాశివ్,శోభన్ రెడ్డి, రాజునాయక్, ఈశ్వర్,కౌన్సిలర్ లు సతీష్ గౌడ్,బోదిరే నర్సయ్య,అయ్యప్ప స్వాములు విగ్నేష్,శ్రీనివాస్,పర్సరత్నం, పోల్కం సుదర్శన్ జలెందేర్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
29.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన పల్లవి

**అనంతగిరి, విశాలభారతి:**
ఈనెల 27న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి నైపుణ్య పరీక్ష నిర్వహించారు. అనంతగిరి మండలం పరిధిలోని పాలవరం జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని మట్టపల్లి పల్లవి విజేతగా నిలిచింది డిసెంబర్ నెలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిరియాల వెంకటయ్య తెలిపారు. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా ప్రథమ స్థానం గెలవాలని పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థినికి పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది ఘనంగా సన్మానించారు.



## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు భేల్ భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు

**పటాన్ చెరు(రామచంద్రాపురం):**
హుజురాబాద్ లో నవంబర్ 29 నుండి డిసెంబర్ 1 వరకు జరిగే ఎస్జిఎఫ్ఐ 68వ రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో రామచంద్రాపురం లోని భేల్ టౌన్షిప్ లో గల భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొననున్నారు. అక్టోబర్ నెలలో కంది లోని డిఏవి స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీలలో భవన్స్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 జిల్లా స్థాయి నుండి ఎంపికైన భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు బాలురు తడుక సాయి నిశాంత్, ప్రసాద్, బాలికలు జ్యోతిర్మయి, నిఖిత, దేవ హర్షిని, అక్షయ గురువారం హుజూరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పయనమయ్యారు. విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ ఉమా శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ శ్రీవాణి, హెడ్ మిస్సెస్ భాను నిర్మల మరియు పిఈటీ బృందం శుభాకాంక్షలు తెలిపారు.



## 'మహబూబ్‌నగర్‌లో రైతు పండుగ'

- రైతు ఉత్పత్తులపై డీసీసీబీ ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు'
- 'స్టాళ్లను పరిశీలించిన మంత్రులు'

**తుర్కయంజాల్, విశాలభారతి:**
రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న ప్రజావిజయోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ గ్రామంలో ప్రభుత్వం రైతుపండుగ జరుగుతోంది. మూడురోజుల పాటు ఈ పండగ కొనసాగనుంది. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంట ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రైతు సదస్సులో భాగంగా 25 వివిధ విభాగాల ఆధ్వర్యంలో 150 స్టాళ్లను ఏర్పాటు చేశారు. వీటిని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, వివిధ జిల్లాల డీసీసీబీ చైర్మన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవం, రైతు పండగపై ప్రతిపక్షాలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకుంటోందన్నారు.



## బహుజన ధిక్కార దార్శనికుడు జ్యోతిరావు పూలే

**నరసింహుల పేట, విశాలభారతి:**
మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కెవిపిఎస్ మండల అధ్యక్షులు కోరింది సురేష్ మాట్లాడుతూ మతంలో ఉన్న దురాచారాలను నిరసించి అంతటితో ఆగక, దానిపరిష్కారమార్గంగా విద్యాలయాలు, సత్యశోధక సమాజము, శిశుసదనాలు, వితంతు శరణాలయాలు స్థాపించిన సంస్కారశీలురు అన్నారు. కల్పిత పురాణాలలోని అవతార కథనాల గుట్టువిప్పిన పూలే గులాంగిరీని (బానిసత్వాన్ని) బయటపెట్టాడు. విద్యానిధులు బహుజనులకు కాకుండా అగ్రవర్ణాలకు ఖర్చు చేస్తున్న తీరును బ్రిటీష్ ప్రభుత్వానికి నివేదించి సామాన్యుల విద్యాహక్కు కోసం పోరాడాడు. స్త్రీ విద్యకు ఆదర్శంగా తన భార్యను మొదటి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దాడు. అంటరానితనాన్ని నిరసించి పాఠశాలల్లో అందరికీ సమాన విద్యావకాశాలు కల్పించాడు. ఈ కార్యక్రమంలో కురంది సురేష్ ,శివ, ఉప్పలయ్య, వెంకన్న, నరేష్, సర్వన్, తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ పూణేం రమేష్ ను కోర్టులో అప్పగించాలి

**తొర్రూర్, విశాలభారతి:**



కామ్రేడ్ పూనెం రమేష్ ను వెంటనే కోర్టులో అప్పజెప్పాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. పేద ప్రజల కోసం పేద ప్రజల హక్కుల పరిరక్షణ కోసం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పని చేస్తుందని కామ్రేడ్ రమేష్ గిరిజన కుటుంబంలో జన్మించి పేద ప్రజల కోసం పనిచేస్తున్న సమయాన పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సోషనీయమని అన్నారు. రాష్ట్రంలో దేశంలో పేద ప్రజలపై దౌర్జన్యాలకు. దోపిడీలకు పాల్పడుతూ అధికార పార్టీల అండదండలతో ప్రజలపై పెత్తనం చేస్తున్న వారిని ఏమనకుండా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోకుండా ప్రజల పక్షాన పోరాడుతున్న ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పూను కోకుండా శాంతియుతంగా ప్రజలలో తలలో నాలుకల పనిచేస్తున్న రమేష్ ను కొంత కాలం నుండి వెంటాడుతూ ఈరోజు అక్రమంగా అరెస్టు చేయడాని. తీవ్రంగా ఖండిస్తున్నామని ఈ అరెస్టును ప్రజలు ప్రజాస్వామ్యవాదులు మేధావులు ఖండించాలని వారు ఒక ప్రకటనలో కోరారు.





## సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ఇంద్రేశం బీసీ గురుకుల బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ
- పాఠశాలలో అవసరమైన మరమ్మతులు వెంటనే చెప్పటాలని ఆదేశం

**పటాన్ చెరు,విశాలభారతి**



సంక్షేమ వసతి గృహాలు గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. పటాన్ చెరు మండలం ఇంద్రేశం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బిసి బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కిచెన్ షెడ్డు డైనింగ్ హాలు, స్టోర్ రూమ్, మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారుల ఆదేశించారు. మరుగుదొడ్లు కిటికీలు డోర్ లకు అవసరమైన మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ పాఠశాల ప్రిన్సిపల్ ఆదేశించారు. భవనం యజమానితో మాట్లాడి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని కస్తూరిబా పాఠశాలలో సంక్షేమ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు తాసిల్దారులు ఎంఈవోలు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకత నిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనమందేల చూడడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగు కోసం చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు వారి స్థాయిలో జరిగే మరమత్తు పనులను ఆయా భవనాల యజమానులతో మాట్లాడి వెంటనే చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. విద్యార్థులకు మేలు ప్రకారం నాణ్యమైన భోజనం అందాల చూడాలని ఎక్స్పైరీ డేట్ దాటిన వస్తువులు వాడకూడదు అని సూచించారు. వసతి గృహాలకు గురుకుల పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతతో ఉండేలా పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఒ కిరణ్ కుమార్, తహసిల్దార్ రాంబాబు, వసతి గృహ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.




## విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**కురవి విశాలభారతి:**
తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ విద్యా సంస్థలలో సమస్యలు పరిష్కారం చేయాలని అదే విధంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అధిక అనేది లో కేటాయించాలని ఎస్ఎఫ్ఐ కొరవి మండల కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐకో కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అప్పటినుండి ఇప్పటి దాకా 48 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వల్ల వసతి గృహాల్లో చనిపోయారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఫుడ్ పాయిజన్ వల్ల చనిపోయిన విద్యార్థులకు 50 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కొలిపాక వీరేందర్, శ్రీకాంత్, అనిల్, రమేష్, మురళి, ఐశ్వర్య, మమత, శ్రేయ, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్

**డోర్నకల్, విశాలభారతి:**
రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థి, విద్యార్థినిలకు మధ్యాహ్న భోజనం మెస్ చార్జీలు పెంచాలని., నాణ్యమైన భోజనం అందించాలని, తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని అన్నారు. గురువారం డోర్నకల్ లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పిడిఎస్యు రాష్ట్ర నాయకులు భానోతు దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అప్పటినుంచి ఇప్పటిదాకా 48 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వల్ల, వసతి గృహాలలో చనిపోయారు. తక్షణమే చనిపోయిన విద్యార్థులకు 50 లక్షల ఎక్స్గ్రేషియా అందించాలని, మరియు తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి లేరని వాపోయారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థులకు తక్షణమే మెస్ చార్జీలు పెంచి, నాణ్యమైన భోజనం అందించాలని, అదేవిధంగా మన ఊరు మనబడి కింద నిర్మాణంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో సిద్దు, హనుమంతు, ప్రవీణ్, మహేందర్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

## ఏడుండ్ల బయ్యారం ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు

- ఎస్సై రాజ్ కుమార్

**బయ్యారం, విశాలభారతి:**



ఏటూరునాగారం నుండి మణుగూరు ప్రధాన రహదారిపై ఏడూళ్ళ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ ఆధ్వర్యం వాహనాల తనిఖీ నిర్వహించారు. వరంగల్, ఏటూరుణాగారం నుండి ఇటుగా వస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి వాహనాల లైసెన్స్ పత్రాలు లేనటువంటి వాహనాదారులకు జరిమానా విధించారు. వాహన దారులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి తీసుకోవాలని డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం, అని వాహనదా రులను హెచ్చరించారు. అనుమానిత వ్యక్తుల సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఈ బయ్యారం ఎస్సై రాజకుమార్ కోరారు. గురువారం నాడు పినపాక మండలంలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో ప్రధాన రహదారిపై పలుచోట్ల విస్తృత తనిఖీలు చేపట్టారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తమ గ్రామాల్లో, కాలనీ లలో ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతలే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని తెలిపారు. కొత్తవారు అద్దెకు వచ్చిన పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఏవైనా సమస్యలున్నా తమదృష్టికి తీసు కరావాలని లేదా 100కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్ లకు, వాట్సాప్ కాల్స్ కు స్పందించవద్దని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరిం చాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఈ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్, పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
29.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## జ్యోతిబాపూలేకు ఘన నివాళి

డోర్నకల్, విశాలభారతి:

మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతి బాపూలే సేవలను స్మరించుకుంటూ వారి ఆశయాలను గుర్తు చేసుకుంటూ, బహుజన వర్గాల కోసం వారు చేసిన పోరాట పటిమను స్మరించుకుంటూ అనునిత్యం బహుజనుల కోసం బహుజనుల బాగు కోసం కృషి చేసిన వారికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిసి రాజ్యాధికార సమితి మరిపెడ అధ్యక్షుడు అల్వాల ఉమేష్ చందర్, తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర సభ్యుడు ముక్కంటి సాయి చరణ్ పటేల్, కార్యదర్శి నలబోతు ముస్తఫా,టౌన్ యూత్ ప్రెసిడెంట్ వేమునూరి శ్రవణ్,గుగ్గిళ్ళ ప్రభాకర్, గాడిపల్లి వెంకన్న,నితీష్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# GENERAL NEWS



## పూలే సేవలు మరువలేనివి

- వజీర్ ప్రకాష్ గౌడ్.

ఎల్బీనగర్ ,విశాలభారతి:

సామాజిక ఉద్యమకారుడు సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం ఎల్బీనగర్ లోని జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు జీవితాన్ని త్యాగం చేశారని, మహిళా విద్య కోసం పూలే తన జీవితాంతం పోరాడారని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, శ్రీపాల్ రెడ్డి, కుట్ల నర్సింహ యాదవ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, నాయకులు షరీఫ్, బద్రీనాథ్, అంతటి శ్రీనివాస్ గౌడ్, తోకటి కిరణ్, ఎంఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మత్స్యకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- ఊట్ల గ్రామంలో మత్స్య సంఘం భవనం ప్రారంభం





పటాన్ చెరు(జిన్నారం),విశాలభారతి

మత్స్యకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం జిన్నారం మండలం ఊట్ల గ్రామంలో జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ సుంకరబోయిన మహేష్ ఆధ్వర్యంలో మత్స్య సంఘం భవన ప్రారంభోత్సవంతో పాటు సత్యనారాయణ వ్రతం, కార్తీక మాస వన భోజనాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. మత్స్యకారుల ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చెరువుల్లో చేపల పెంపకానికి చేప పిల్లల పంపిణీ ప్రక్రియను ప్రారంభించిందని, మత్స్యకారుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్తీక మాసం సందర్భంగా శివ కేశవులని పూజిస్తూ ఏర్పాటు చేసిన వన బోజనాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వన బోజనాలు ఐక్యతను సూచించడంతో పాటు మనషుల మధ్య స్నేహభావం పెంపొదిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు, జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేష్,కాంగ్రెస్ నాయకులు ఎట్టయ్య, మండల అధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్, గారెల మల్లేష్, మాణిక్యరావ్, లక్ష్మణ్ యాదవ్, వెంకటేశ్, అశోక్, గణేష్, వీరేష్, పూజరి రాజు, సాయి, శ్రీశైలం, రఘు, మహిళలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## కాలనీవాసుల సమస్య పరిష్కరించాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.

ఎల్బీనగర్ ,విశాలభారతి:

హయత్ నగర్ డివిజన్ లోని రాఘవేంద్ర కాలనిలో గతా అయిదారు నెలలుగా త్రాగునీరు సరిగ్గా రావడంలేదని సంబంధిత జలమండలి సిబ్బందికి తెలిపినప్పటికీ వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి స్వయంగా కాలనీవాసులతో కలిసి జల మండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ కార్యాలయానికి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5,6 నెలలుగా డివిజన్ లోని రాఘవేంద్ర కాలనివాసులు త్రాగునీరు సరిగ్గా రావడంలేదని సమాచారం ఇచ్చినప్పటికీ జలమండలి అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వివరించడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇప్పటికైనా డివిజన్ వాసులకి ఎలాంటి త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని జలమండలి జనరల్ మేనేజర్ కి తెలపడం జరిగింది.ఈ కార్యక్రమం లో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు చిన్న , లింగ రెడ్డి , హరినాథ్ బాబు , నరహరి , జనార్ధన్ రెడ్డి , బుచ్చి రెడ్డి , సుబ్రహ్మణ్యం, జంజ్య నాయక్ , కాలనీవాసులు పాల్గొన్నారు.



## జ్యోతిరావు పూలేకు 'నీలం' నివాళి

పటాన్ చెరు,విశాలభారతి

జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని చిట్కుల్ లో పూలే చిత్రపటానికి పూలు వేసి కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు విద్య, మహిళోద్ధరణకు కృషి చేసిన గొప్ప వ్యక్తి పూలే అని, ఆయన దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్య కోసం పనిచేశారని గుర్తుచేశారు, ఆయన బాట సమాజనికి అనుసరణీయం అని నీలం మధు పేర్కొన్నారు.



## ఎంబీబీఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే బాసట

నాచారం,విశాలభారతి:

హిందూపురం ఎమ్మెల్యే సిని నటుడు బాల కృష్ణ చేతుల మీదుగా 4 గురు ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కుల పంపిణీ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎంబీబీఎస్ సీటు సాధించిన వారికి ఫీజు చెల్లించడం నిజంగా అభినందనీయమని హిందూపురం ఎమ్మెల్యే సిని నటుడు బాలకృష్ణ అన్నారు. నాచారం హైపర్ మార్ట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న బండారి లక్ష్మారెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు



## సౌత్ జోన్ పోటీలకు గీతం కబడ్డీ జట్టు

- అంతర్ విశ్వవిద్యాలయ 'కబడ్డీ మహిళా ఛాంపియన్ షిప్ 2024-25'కు పోటీ

పటాన్ చెరు,విశాలభారతి

ప్రతిష్ఠాత్మకమైన దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ 'కబడ్డీ మహిళా ఛాంపియన్ షిప్ 202425'లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బాలికల జట్టు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు క్రీడల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.నారాయణరావు చౌదరి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఛాంపియన్ షిప్ తమిళనాడులోని కరైకుడిలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ పోటీలను భారతీయ విశ్వవిద్యాలయాల అసోసియేషన్, అలగప్ప విశ్వవిద్యాలయంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలియజేశారు. గీతం కబడ్డీ జట్టు విశాఖపట్నం, హైదరాబాదు, బెంగళూరులో ఉన్న మూడు ప్రాంగణాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన అథ్లెట్ల యొక్క శక్తివంతమైన సమష్టి శక్తిగా డాక్టర్ నారాయణరావు అభివర్ణించారు. కఠినమైన ఎంపిక ప్రక్రియను అనుసరించి, జట్టు సభ్యులు తమ నైపుణ్యాలను, పోటీతత్త్వాన్ని ప్రాంతీయ వేదికపై ప్రదర్శించడానికి ఎంపిక చేశామన్నారు. విద్యార్థులలో క్రీడలు, శారీరక ధారుఢ్యాన్ని ప్రోత్సహించడంలో గీతం నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.
టోర్నమెంటు కోసం సన్నాహకంగా, గీతం ఉన్నతాధికారులు, స్పోర్ట్స్ డైరెక్టర్ తదితరులు జట్టు సభ్యులకు తమ హృదయ పూర్వక మద్దతు, ప్రోత్సాహాన్ని అందించడమే గాక జట్టు సామర్థ్యాలపై విశ్వాసం వ్యక్తం చేసినట్టు తెలిపారు. గీతం జట్టు విజయవంతమైన ఫలితంగా తిరిగి రావాలని వారంతా ఆకాంక్షించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు



## ప్రభుత్వ పాఠశాలను తనికి చేసిన మున్సిపల్ కమిషనర్

విశాలభారతి,కీసర:

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దమ్మాయిగూడ మున్సిపాలిటీలోనీ ప్రభుత్వ పాఠశాలను గురువారం సందర్శించి తనికి చేసిన మున్సిపల్ కమిషనర్ నాగమణి.మున్సిపల్ లోని తిమ్మాయిపల్లి మరియు చీర్యాలలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎలా విద్యార్థులకు పెడుతున్నారు అని పరిశీలించారు.ఈ సంధర్బంగా మున్సిపల్ కమిషనర్ విద్యార్థులకు వంట చేసే సిబ్బందితో మాట్లాడారు.సమయానికి సామగ్రి వస్తున్నాయా ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలి అని వారికి చెప్పడం జరిగింది.అనంతరం విద్యార్థులతో కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ నారాయణ గౌడ్ మరియు సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రభు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలకు ఆహ్వాన కార్యక్రమం

- నెలలో రెండుసార్లు ఆహ్వాన కార్యక్రమం నిర్వహించాలి
- ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషారాణి

డోర్నకల్, విశాలభారతి:



కుడియా తండా అంగన్వాడి కేంద్రం నందు గర్భిణీ ఆహ్వాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ ఆహ్వాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి గర్భిణీ తల్లులకు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషరాణి మాట్లాడుతూ గర్భస్థ సమయంలో, విటమిన్స్ ఎక్కువగా ఆహారాన్ని తీసుకుంటూ, ప్రతిరోజు పాలు గుడ్లు క్రమం తప్పకుండా తీసుకోవాలని, పోషణ పదార్థాల గురించి పోషణ మాసం గురించి ప్రతి ఒక్క అంగన్వాడి టీచర్ గర్భిణి, గర్భిణీతరులకు, తెలియపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుడియ అంగన్వాడి టీచర్ కుమ్మరి కుంట్ల జ్యోతి,గర్భిణీ ఈవెంట్ పేరు జాటత్ కవిత, తల్లులు శ్రీదేవి, నవ్య,ఆయా జాటోత్ లక్ష్మి, తల్లులు, గర్భిణీలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

ఎల్బీనగర్ విశాలభారతి:



హస్తినాపురం డివిజన్ పద్మావతి కాలనీలో గత రెండు సంవత్సరాల క్రితం మంజూరు అయినా రోడ్డు పనులు నిధులు లేక ప్రారంభించని రోడ్డు పనులు వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ ఆదేశించారు. జిహెచ్ఎంసి ఏఈ మల్లికార్జున గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పల్లం శ్రీనివాసులు ,కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి కాలనీలో పర్యటించి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులను నేటికీ చేపట్టలేదని వెంటనే అట్టి పనులు చేపట్టాలని కాలనీవాసులు కార్పొరేటర్ సుజాత నాయక్ నాయకులు కోరారు ఆ పనులకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయిస్తామని వెంటనే పనులు ప్రారంభించాలని ఏ ఈ మల్లికార్జున గౌడ్ కాంట్రాక్టర్ను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత గతంలో మంజూరై నిధులు లేక నిలిచిపోయిన పనులన్నిటిని ఒక్కొక్కటిగా చేపడుతున్నట్లు తెలిపారు.కాలనీలలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తేవాలని ఆమె కోరారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

అడవిదేవులపల్లి, విశాలభారతి:

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అడవిదేవులపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య మెగా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడవిదేవులపల్లి సబ్ ఇన్స్పెక్టర్ శేఖర్ మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండల ప్రజలు మరియు గ్రామ ప్రజలు యొక్క వైద్య శిబిరంను వినియోగించుకొని వైద్య పరీక్షలు చేయించుకొని ప్రజల వారి యొక్క ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్ డాక్టర్స్ మధులత ,వైష్ణవి మెడికల్ క్యాంపు ఇంచార్జ్ హరీష్ రెడ్డి , రవి , అపోలో ఆస్పటల్ మార్కెటింగ్ ఇంచార్జ్ రాజి రెడ్డీ , సైదులు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## కేరళలో మీరిచ్చిన గ్రాండ్ వెల్‌కమ్ జీవితంలో మరిచిపోలేను: అల్లు అర్జున్



పుష్ప-2 ది రూల్ ఇప్పుడు భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రమిది. ఇండియాస్ బిగ్గెస్ట్ ఫిలింగా రూపొందిన ఈ చిత్రంలో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నట విశ్వరూపం చూడబోతున్నారు. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభ, ఆయన క్లాస్ టేకింగ్‌తో ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ చిత్రంగా నిలవబోతుంది. ప్రపంచ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో అత్యున్నతంగా హై బడ్జెట్‌తో నిర్మించారు. డిసెంబరు 5న చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. కాగా ఈ చిత్ర ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. అంతేకాదు ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి ఈవెంట్ సన్సేషన్ అవుతుంది. ఇటీవల బీహార్‌లోని పాట్నాలో జరిగిన పుష్ప-2 ట్రైలర్ లాంచ్ వేడుక ఇండియా మొత్తం హాట్‌టాపిక్‌గా నిలిచింది. చెన్నయ్‌లో జరిగిన వైల్డ్ ఫైర్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్‌గా నిలిచింది. ఐకాన్ స్టార్ ఎక్కడికి వెళితే అక్కడ ఆయన అభిమానులు గ్రాండ్ వెల్‌కమ్ పలుకుతున్నారు. తాజగా ఈ చిత్రం మరో గ్రాండ్ ఈవెంట్ కేరళలోని కొచ్చిలో ఎంతో ఘనంగా జరిగింది. కేరళలో మల్లు అర్జున్‌గా అత్యధిక అభిమానులు ఉన్న తెలుగు హీరోగా పేరున్న అల్లు అర్జున్‌కు అక్కడ అశేష జనాదరణ లభించింది. ఈ వేడుకలో ఐకాన్‌స్టార్ అభిమానులు ఎంతో సందడిగా కనిపించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ 'థ్యాంక్యూ కేరళ. మీ అడెంప్టెడ్ సన్ మల్లు అర్జున్‌కు మీరిచ్చిన ఈ గ్రాండ్ వెలకమ్ మరిచిపోలేనిది. గత 20 ఏండ్ల నుంచి మీరు నాపై ప్రేమ చూపిస్తున్నారు. ఈ సినిమా కెరీర్‌లో చాలా ప్రత్యేకం. ఈ చిత్రంలో మలయాళ గొప్ప నటుడు ఫహాద్ ఫాజిల్‌తో పనిచేయడం ఆనందంగా వుంది. ఈ సినిమాలో ఆయన నటన చూసి మీరంతా గర్వపడతారు. నా సినిమా కోసం మీరు మూడేళ్లు గా వెయిట్ చేస్తున్నందుకు కృతజ్ఞతలు. తప్పకుండా ఇక నుంచి తొందరగా సినిమాలు చేస్తాను. ఈ సినిమాలో రష్మిన తన నటనతో ఈ మెప్పిస్తుంది. రష్మికతో పనిచేయడం ఎంతో కంఫర్ట్‌గా అనిపించింది. రష్మిక ప్రజెన్స్‌తో సినిమా చాలా బెటర్ అయ్యింది. సుకుమార్ నా కెరీర్‌లో ఆర్యను ఇచ్చాడు. ఆర్య చిత్రంతోనే నా మార్కెట్ కేరళలో స్టార్ట్ అయ్యింది. దర్శకుడు సుకుమార్ వల్లే నేను మీకు దగ్గరయ్యాను. నా కెరీర్‌లో దేవి శ్రీప్రసాద్ ఎన్నో సూపర్‌హిట్ సాంగ్స్ ఇచ్చాడు. నా చిత్రానికి పనిచేసిన మలయాళీ రైటర్స్ కూడా.. చాలా థ్యాంక్స్. మైత్రీ నవీన్, రవి, చెర్రీలకు వారి సపోర్ట్ వల్ల ఈ సినిమా సాధ్యమైంది. ఓ రోజు దేవిశ్రీప్రసాద్‌కు ఫోన్ చేసి నా కేరళ ఆడియన్స్‌కు ప్రేమ చూపించాలి అన్నాను. ఈ సినిమాలో మలయాళ లిరిక్స్‌తో ఓ సాంగ్‌ను చేశాం. అన్నిభాషల్లో మలయాళం లిరిక్స్ ఉంటాయి. ఇది మలయాళ ప్రేక్షకులకు ఈ రూపంలో ప్రేమ చూపిస్తున్నాను. మలయాళీ ఫ్యాన్స్ ఆర్మీ అనే పదాన్ని స్టార్ట్ చేశారు. డిసెంబరు 5న పదకొండు వేలకు పైగా థియేటర్‌లో విడుదలవుతోంది.. మలయాళంలో చేసిన ఈ పాటలో వింటేజ్ బన్నీని చూస్తారు. పుష్ప పాత్రలో పుష్ప-1లో డ్యాన్సులు చేయడం కుదరలేదు. ఈ పాటలో నా డ్యాన్స్ వింటేజ్ బన్నీని చూస్తారు. ఆరు లాంగ్వేజ్‌ల్లో ఈ పాట మలయాళంలోనే హుక్ లైన్ ఉంటుంది. వైల్డ్ ఫైర్‌తో సినిమా ఉంటుంది. ఎంజాయ్ చేయండి' అన్నారు. అల్లు అర్జున్ స్పీచ్‌కు ముందుగా మలయాళంలో మాట్లాడి అభిమానులను హుషారెత్తించారు.



### 200 మంది ఆర్టిస్టులతో భారీ సన్నివేశాల

# హరి హర వీర మల్లు

ప్రాంతీయ భాషా చిత్రాలతోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అతికొద్ది మంది కథానాయకులలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒకరు. ఆయన తన సినీ ప్రయాణంలో తొలిసారిగా 'హరి హర వీర మల్లు పార్ట్ 1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' అనే పీరియాడికల్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు. ప్రేక్షకులకు ప్రత్యేకమైన మరియు మరపురాని థియేట్రికల్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో నిర్మాతలు భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇటీవల చిత్ర బృందం, హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశాన్ని చిత్రీకరించింది. పవన్ కళ్యాణ్‌తో పాటు 400 500 మంది పాల్గొన్న ఈ భారీ యుద్ధ సన్నివేశం కోసం యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ని ప్రత్యేకంగా నియమించారు. ఈ యుద్ధ సన్నివేశం అద్భుతంగా రావడంతో చిత్ర బృందం ఎంతో సంతోషంగా ఉంది. హరి హర వీర మల్లు పార్ట్ 1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' చిత్రానికి సంబంధించి తాజాగా నిర్మాతలు కీలక విషయాన్ని పంచుకున్నారు. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ వారాంతంలో విజయవాడలో ఆఖరి షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్ లో అత్యంత కీలకమైన భారీ సన్నివేశాలను చిత్రీకరించబోతున్నారు. ఈ సన్నివేశాల చిత్రీకరణలో పవన్ కళ్యాణ్ తో పాటు, 200 మంది ఆర్టిస్టులు పాల్గొనబోతున్నారు. ఈ షెడ్యూల్ తో 'హరి హర వీర మల్లు' చిత్రీకరణ మొత్తం పూర్తి కానుంది.



అగ్ర కథానాయిక కీర్తి సురేష్ పెళ్లి గురించి కొంతకాలంగా సోషల్‌మీడియాలో వార్తలొస్తున్నాయి. తన కాలేజీ ఫ్రెండ్‌తో ఈ భామ ప్రేమలో ఉందని, త్వరలో అతన్ని పెళ్లాడనుందని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో తన రిలేషన్‌షిప్ స్టేటస్‌పై కీర్తి సురేష్ బుధవారం అధికారిక ప్రకటన చేసింది. ప్రియుడు ఆంటోనీతో దీపావళి సందర్భంగా తీసుకున్న ఓ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. తమ స్నేహబంధం జీవితాంతం కొనసాగనుందని తెలిపింది. ఈ వార్త తెలుసుకున్న పలువురు సినీ సెలబ్రిటీలు కీర్తి సురేష్‌కు శుభాకాంక్షలు అందజేశారు. ఇక అభిమానులు ఆంటోని వ్యక్తిగత వివరాల గురించి సోషల్‌మీడియాలో ఆరా తీయడం మొదలుపెట్టారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కాలేజీ రోజుల నుంచే కీర్తి సురేష్-ఆంటోని మంచి స్నేహితులని తెలిసింది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆంటోని కొంతకాలం విదేశాల్లో ఉద్యోగాలు చేశాడని, ప్రస్తుతం కేరళలో పలు వ్యాపారాలను నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. ఇరు కుటుంబాల అనుమతితోనే కీర్తి సురేష్ తన రిలేషన్‌షిప్‌పై ప్రకటన చేసిందని, త్వరలో ఈ జంట పెళ్లిపీటలెక్కనున్నారని తెలుస్తున్నది. 'నేను శైలజ' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసిన కీర్తి సురేష్ అనతికాలంలోనే దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఎదిగింది. 'మహానటి' చిత్రంలో అద్భుతాభినయానికిగాను ఉత్తమ నటిగా జాతీయ పురస్కారాన్ని అందుకుంది. ప్రస్తుతం ఆమె రివాల్వర్ రీటా, బేబీ జాన్ చిత్రాల్లో నటిస్తున్నది.

## ఇక అతనితోనే పయనం!

## 'గేమ్ చేంజర్' నుంచి 'నా నా హైరానా' సాంగ్ రిలీజ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. భారీ అంచనాల నడుమ 2025లో విడుదలవుతున్న పాన్ ఇండియా మూవీ. ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సంక్రాంతి సందర్భంగా జనవరి 10న విడుదలవుతుంది. విడుదల తేది దగ్గరవుతున్న కొద్దీ రామ్ చరణ్, కియారా అద్వానీ జోడీ మధ్య కెమిస్ట్రీని స్టార్ డైరెక్టర్ శంకర్ ఎంత గొప్పగా తెరకెక్కించారోనని అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు ఈ నిరీక్షణకు తెరపడింది. ఈ చిత్రం నుంచి రొమాంటిక్ సాంగ్ విడుదలైంది. తెలుగులో 'నా నా హైరానా'.. హిందీలో 'జానా హైరాన్ సా'.. తమిళంలో 'లై రానా' అంటూ మెలోడీ ఆఫ్ ది ఇయర్‌గా ఈ పాట ప్రేక్షకులను సమ్మోహనపరుస్తోంది. ఈ పాటను తెలుగులో రామజోగయ్యశాస్త్రి రాయగా, తమిళంలో వివేక్, హిందీలో కౌశర్ మునీర్ రాశారు. ఈ పాటకు సంబంధించిన బీటీఎస్‌కు కూడా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఇక రామ్ చరణ్, కియారా అద్వానీ జోడీ పాటలోని స్వచ్ఛతను హావభావాల రూపంలో పలికించారు. పాట విడుదల కాగానే ఆడియెన్స్ నుంచి అమేజింగ్ రెస్పాన్స్ వస్తోంది. ప్రేమలో ఉన్న హీరో హీరోయిన్లు ఒకరిపై ఒకరికి మనసులోని ప్రేమ భావాలు పదాల రూపంలో అందంగా అమర్చినట్లు కుదిరాయి. ఇక మేకింగ్ విషయానికి వస్తే శంకర్ మరోసారి పాటలను చిత్రీకరించటంలో తనకు తానే సాటి అని మరోసారి నా నా హైరానా పాటతో నిరూపించుకున్నారు. న్యూజిలాండ్‌లో ఈ పాటను ఇండియాలోనే ఇప్పటి వరకు ఎవరూ చిత్రీకరించని విధంగా రెడ్ ఇన్‌ఫ్రా కెమెరాతో చిత్రీకరించారు. ఒక్కో సన్నివేశం ఒక్కో పెయింటింగ్‌లా విజువల్ బ్యూటీతో పాట మనసుని తేలిక పరుస్తోంది. మళ్లీ మళ్లీ చూడాలనుకునేంత గొప్పగా పాటలోని ప్రతీ ఫ్రేమ్ ఉంది. ఇక మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ పాటను ఫ్యూజన్ మెలోడీ (వెస్ట్రన్, కర్ణాటిక్ కాంబో)గా ట్యూన్ చేశారు. అలాగే బర్డ్స్ టోన్స్‌ను ఉపయోగించారు.. రెండు మోనో టోన్స్‌ను ఓ స్టీరియో సౌండ్‌గా మార్చి ఈ పాటలో ఉపయోగించటం విశేషం. రీసెంట్ గా విడుదలైన 'గేమ్ చేంజర్' టీజర్‌కు ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌ను ఇప్పటి వరకు చూపించనటువంటి ఓ సరికొత్త అవతార్‌లో శంకర్ ఆవిష్కరిస్తున్నారు. ఇందులో చరణ్ పవర్‌ఫుల్ ఐఏఎస్ ఆఫీసర్ పాత్ర చేయటంతో పాటు సమాజానికి సేవ చేయాలనుకునే ఉత్సాహవంతుడైన యువకుడి పాత్రలోనూ కనిపించనున్నారు. సినిమాలో హై రేంజ్ యాక్షన్ సన్నివేశాలు, పొలిటికల్ ఎలిమెంట్స్, ఆకట్టుకునే కథనం, నటీనటుల అద్భుతమైన పనితీరు ఇవన్నీ ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతినిస్తాయి.



## అల్లరి నరేష్ బచ్చల మల్లి రివర్టింగ్ టీజర్ లాంచ్

హీరో అల్లరి నరేష్ తన అప్ కమింగ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'లో కంప్లీట్ మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన బ్లాక్ బస్టర్స్ తర్వాత హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈరోజు ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. టీజర్ మెయిన్ గా అల్లరి నరేష్ పాత్రపై ఫోకస్ చేస్తోంది. అల్లరి నరేష్ క్యారెక్టర్ ని కేర్ ఫ్రీ, మొండిపట్టుదల, మూర్ఖత్వం వ్యక్తిగా టీజర్ హైలెట్ చేస్తోంది. అమృత అయ్యర్ క్యారెక్టర రిజెక్ట్ చేసినప్పటికీ ధైర్యంగా ఆమెతో ఫ్లర్ట్ చేస్తాడు. టీజర్ అతని రెబల్, నిర్లక్ష్య వైఖరి చూపిస్తోంది. అతను ఇతరుల అభిప్రాయాలని పట్టించుకోకుండా తన స్వంత నిబంధనలపై జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నాడు. నరేష్ పాత్ర పిల్లల నుంచి విరాళాల పెట్టెను తీసుకున్నప్పుడు, అతని రియల్ నేచర్ ని ప్రజెంట్ చేసే మూమెంట్ తో టీజర్ ఎండ్ అయ్యింది. నరేష్ మాస్ లుక్, అతని పెర్ఫార్మెన్స్ కంప్లీట్ చేస్తూ ఈ మాస్ క్యారెక్టర్‌కి డెప్త్ తీసుకొచ్చింది. అతని ప్రయాణంలో అమృత అయ్యర్ కీలక పాత్ర పోషిస్తుండగా, రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష కూడా ఉన్నారు. రిచర్డ్ ఎమ్ నాథన్ సినిమాటోగ్రఫీ, విశాల్ చంద్రశేఖర్ పవర్ ఫుల్ స్కోర్ టీజర్ ని మరింత ఎలివేట్ చేశాయి. హాస్య మూవీస్ ప్రొడక్షన్ వాల్యూస్ టాప్ క్లాస్ లో వున్నాయి. ఎడిటింగ్ ఛోటా కె. ప్రసాద్. సుబ్బు మంగదేవి కథ, సంభాషణలు రాశారు,విప్పర్తి మధు స్క్రీన్‌ప్లే, అడిషినల్ స్క్రీన్‌ప్లేకి విశ్వనేత్ర సహకారం అందించారు. టీజర్ స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసింది. బచ్చల మల్లి డిసెంబర్ 20న క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది.

## కేశవ చంద్ర రమావత్ (కెసిఆర్) చిత్రానికి ఆస్కార్ అవార్డు వచ్చినంత సంతోషంగా ఉంది : రాకింగ్ రాకేష్



విభూది ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ ద్వారా ఈనెల 22వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం కేశవ చంద్ర రమావత్. గరుడవేగ అంజి సినిమాటోగ్రఫీ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందించారు. జబర్దస్త్ నటుడు రాకింగ్ రాకేష్, అనన్య కృష్ణన్ ప్రధాన పాత్రలుగా తాగుబోతు రమేష్, జోర్దార్ సుజాత, తనికెళ్ల భరణి ధనరాజ్, మైమ్ మధు తదితరులు కీలకపాత్రలో పోషించారు. అయితే ఈ చిత్రాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, సిద్దిపేట శాసనసభ్యులు శ్రీ హరీష్ రావు గారు మరికొందరు పార్టీ కార్యకర్తలతో కలిసి చూడడం జరిగింది. ఈ సందర్భంగా హరీష్ రావు గారు మాట్లాడుతూ... "జబర్దస్త్ తో అందరికీ పరిచయమై ఈరోజు వెండి తెరకు చేరిన రాకేష్ కి, అలాగే ఈ చిత్రంలో పనిచేసిన కళాకారులకు, సినిమా టీంకు నా హృదయపూర్వక అభినందనలు. ఈ చిత్రం చాలా అద్భుతంగా తీశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందుకి ఆ తర్వాతకి ప్రజల జీవితాలు ఎలా ఉన్నాయి అనేది చూపిస్తూ ఓ మంచి ప్రేమ కథతో తెలంగాణ గ్రామీణ వాతావరణానికి జోడించి ఈ చిత్రం తీయడం జరిగింది. సెంటిమెంటులతో మంచి ఎమోషన్ తో ఈ చిత్రాన్ని ఎక్కడ బోర్ కొట్టకుండా చిత్రం తెరకెక్కించారు. ఒక వైపు తెలంగాణ అభివృద్ధి చేసిన తీరును చూపిస్తూ గ్రామీణ వాతావరణం జీవితాలను వారి జీవనశైలి చాలా అద్భుతంగా చూపించారు. మరొకసారి ఈ చిత్రాన్ని అందరూ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. రాకేష్ ముందు ముందు మరెన్నో సందేశాత్మక సినిమాలను తీయాలని కోరుకుంటున్నాను" అన్నారు. రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ... "ఈ సినిమాను మొదటి నుండి ఆదరించిన ప్రతి ఒక్కరికి నా ధన్యవాదాలు. ఈ సినిమాకు ఎంత పెద్ద అవార్డు వచ్చిన హరీష్ రావు గారు రావడం అనేది అంతకంటే ఎంతో పెద్ద అవార్డు. హరీష్ రావు గారు వచ్చి ఈ సినిమాని చూడటమే ఈ సినిమాకు వచ్చిన ఆస్కార్ అవార్డుగా భావిస్తున్నాను. హరీష్ రావు గారు వచ్చి ఈ సినిమాను చూడటమే ఒక అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.